# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 9 డిసెంబరు 2025 | 5



కొడుకుపై తల్లి ఫిర్యాదు

» కొబ్బరికాయలు దొంగిలించాడని కేసు 7

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు


## 'సర్ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ' బ్రోచర్ ఆవిష్కరణ

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోనసీమప్రాంతాన్ని కేరళతరహాలో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలుచేపడుతున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనవరి 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సర్ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పడవ పోటీలు, ముగ్గులు, ఈత, గాలిపటాల పోటీలకు సంబంధించిన బ్రోచర్, లోగోలను సోమవారం ఆవిష్కరించారు. లొల్లలాకులనుంచి తాడిపూడి వంతెనవరకూ ఈ పోటీలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సర్ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరిట ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు పడవ పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులు ఉంటాయని, మిగిలిన విభాగాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని తెలిపారు. పర్యాటకులను ఆకట్టుకునేలా జాతీయస్థాయిలోడ్రాగన్ పడవ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ పోటీలు నిర్వహించే చోట కోనసీమలో తయారు చేస్తున్న ఆత్రేయపురం పూతరేకులు, మామిడి తాండ్ర, బొబ్బట్లు, పచ్చళ్లు, ఫుడ్‌ఫెస్టివల్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తో కలిసి బ్రోచర్, లోగో, పోస్టర్‌ను ఆవిష్కరించి విడుదలచేశారు. ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకట్రాజు, సత్యనారాయణరెడ్డి, కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్లపూడి భాస్కరరావు, ఆర్‌అండ్‌బీ రాజేంద్రప్రసాద్, ఆర్టీసీ డీఎం కుమార్, హెడ్‌వర్క్స్ ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్,కెనాల్ ఈఈ వెంకటేశ్వరరావు, సీఐ విద్యాసాగర్, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్ఐ రాము,ఎఫ్‌డీవో డెవిడ్‌రాజు పాల్గొన్నారు.



సంక్రాంతి పడవల పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు



నన్నయ విశ్వవిద్యాలయంలో పుస్తకావిష్కరణ చేస్తున్న వెంకయ్యనాయుడు


అమ్మ.. అనే పిలుపులో మాధుర్యం మమ్మీలో ఉండదు!

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

» నన్నయలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం'పై రెండు రోజుల కార్యశాల ప్రారంభం 6



## రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్



» గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయతలు ఎనలేనివి

» ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలోను లేను

» నాకు ప్రేరణ మా ఆంటీ విజయనిర్మల

» 'ఆంధ్రజ్యోతి'తో ఇంటర్వ్యూలో సహజనటి జయసుధ 6


## కలెక్టరేట్ 'పీజీఆర్ఎస్'కు 265 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురంటౌన్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి లబ్ధిదారులకు నూరుశాతం పరిష్కారమార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో నిర్వహించారు. నిర్దేశిత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ అర్జీదారులతో సంబంధిత అధికారులు మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 265అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మి, డీఎల్డీవో రాజేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

### ఎస్పీ కార్యాలయంలో 36 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌తో కలసి పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రధానంగా భూతగాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, సివిల్ తగాదాలకు సంబంధించి 36 అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ రాహుల్ మీనా

# బోగస్‌లే.. కదిలేదిలే..



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మొండిబాకీలు వెన్నాడుతున్నాయి. ఏళ్లకు ఏళ్లు వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. అసలు వస్తాయోరావోనన్నట్టు ఏడిపిస్తున్నాయి. అయితే అత్యధిక బాకీలు బోగస్‌వే ఉండడంతో అధికారులు వీటి వసూలుపై ఆశలు వదిలేసుకుంటున్నారు. చాలావరకు రికార్డులు కంప్యూటరీకరణ కాకపోవడంతో కాగితాలపై రుణాలు చూపించి బోగస్ వ్యక్తులు అధికంగా డీసీసీబీ డబ్బును మింగేశారు. ప్రధానంగా గత వైసీపీ హయాంలో దొంగ రుణాలు భారీగా నమోదయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే సమయానికి డీసీసీబీ మొండి బాకీలు రూ.200 కోట్ల వరకు ఉంటే, వైసీపీ గద్దె దిగే సమయానికి మొండిబాకీలు రూ.980 కోట్లకు చేరాయంటే ఏస్థాయిలో డీసీసీబీ డబ్బును అప్పటి అధికార పార్టీ నేతలు దిగమింగేశారో అర్థం చేసుకోవచ్చు.**

కాకినాడ కేంద్రంగా పనిచేసే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మొండిబాకీలు వెన్నాడుతున్నాయి. మూడేళ్లకుపైగా రూ.980 కోట్ల రుణాలు వసూలవక ఎన్‌పీఏలుగా మారాయి. వాస్తవానికి ఏదైనా బ్యాంకు రుణం మంజూరు చేయాలంటే అన్ని రకాల పత్రాలు తీసుకునే అప్పు మంజూరు చేస్తాయి. ఆనక వసూలవకపోతే ఆస్తులు వేలం వేసయినా డబ్బు రాబట్టుకుంటాయి. కానీ డీసీసీబీ రూటే వేరు. అన్నదాతలకు ఈ బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా వ్యవసాయానికి సంబంధించి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తుంటుంది. అయితే అనేకమంది రైతులు తమ భూమి పత్రాలు చూపించి లక్షల్లో మాత్రమే డీసీసీబీ బ్రాంచ్‌ల్లో రుణాలు తీసుకుంటారు. వీరి విషయంలో అధికారులు సవాలక్ష నిబంధనలు అమలుచేస్తారు. కానీ పలుకుబడి కలిగిన రాజకీయ నేతల విషయంలో మాత్రం వారు సూచించిన వ్యక్తుల విషయంలో పెద్దగా నిబంధనలు పాటించకుండా చూసీచూడనట్టు వ్యవహరిస్తారు. ఇక్కడే డీసీసీబీ డబ్బు దొంగరుణాల ద్వారా బయట వ్యక్తుల పరమవుతోంది. ప్రధానంగా పలు బ్రాంచ్‌ల్లో సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి బోగస్ రుణాలు జారీచేసి కోట్లకుకోట్లు గడచిన కొన్నేళ్లలో స్వాహా చేసేశారు. దొంగ పత్రాలు చూపించి, లేని భూములను రికార్డుల్లో చూపించి కోట్లకుకోట్లు రుణాలు మంజూరు చేసి తలాకొంచెం పంచుకు తినేశారు. ప్రధానంగా కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి ఈ ఏడాది బట్టబయలైంది. రాజకీయ ప్రమేయంతో గత కొన్నేళ్లుగా మూలనపడ్డ విచారణను కూటమి ప్రభుత్వం రాగానే వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలో పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి పద్మ విచారణ జరిపి ఈ ఏడాది జనవరిలో జిల్లా సహకార అధికారికి పూర్తిస్థాయి నివేదిక అందించారు. ఇందులో సొసైటీ సీఈవోలు, మేనేజర్లు, సూపర్‌వైజర్లు అంతా కలిపి ఈ అవినీతికి పాల్పడ్డారని నివేదికలో గుర్తించారు. అలాగే ఏలేశ్వరం సొసైటీ పరిధిలోను ఇలాగే బోగస్ రుణాలు మంజూరు చేశారు. బ్యాంకు కాగితాలపై ఉన్న రుణం తీసుకున్న వ్యక్తుల పేర్ల ఆచూకీ కూడా కనిపించడం లేదు. ఇలా ఎక్కడికక్కడ బ్యాంకు డబ్బును అక్రమార్కులు కాజేశారు. డీసీసీబీ బ్రాంచ్‌ల్లో రికార్డులు కంప్యూటరీకరణ కాకపోవడాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ గత అయిదేళ్ల పాలనలో అడ్డగోలుగా మింగేశారు. మరో మూడు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మొండిబాకీల లెక్కలు తేల్చడానికి కసరత్తు ప్రారంభించిన అధికారులు ఈనెల 3 నాటికి ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌ల వారీగా మొండిబాకీలు లెక్కలు తేల్చగా కళ్లుబైర్లు కమ్మే అంకెలు తేలాయి. ఉమ్మడి జిల్లాలోని 53 డీసీసీబీ బ్రాంచ్‌ల్లో కలిపి ఎన్‌పీఏ బాకీలు రూ.980.72 కోట్లు తేల్చారు. ఇందులో అత్యధికంగా ప్రత్తిపాడు బ్రాంచ్‌లో రూ.332 కోట్లు బాకీ తేలింది. ఇవన్నీ మూడు నుంచి ఐదేళ్ల మధ్య ఇచ్చిన బాకీలే ఉన్నట్టు గుర్తించారు. వాస్తవానికి రూ.332 కోట్ల బాకీలకు సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తులు డబ్బుల క్రమం తప్పకుండా చెల్లించకపోతే అధికారులు అప్రమత్తం కావాలి. తక్షణం రుణ వసూలుకు సంబంధించి ఆస్తుల వేలం వరకు వెళ్లాలి. కానీ ఇదేదీ జరగలేదు. అలాగే ఏలేశ్వరం బ్రాంచ్‌లో రూ.173 కోట్లు మొండి బాకీగా తేలింది. దీనిపై విచారణకు అడుగులు పడగా, తదుపరి విచారణ లేకుండా కొందరు అడ్డుకున్నారు. ఈ బాకీల్లో 80 శాతానికిపైగా బోగస్ రుణాలే. జగ్గంపేట బ్రాంచ్‌లో రూ.72కోట్లు, అన్నవరం రూ.45.53 కోట్లు, గోకవరం రూ.18కోట్లు, మండపేట రూ.12.29 కోట్లు చొప్పున పేరుకుపోయాయి. ఇవన్నీ దాదాపుగా గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసినవే ఉన్నాయి. సాధారణంగా నిజమైన రైతులు రుణాలు తీసుకుంటే ఎంత కష్టమైనా తిరిగి చెల్లిస్తారు. ఎన్నేళ్లయినా వసూలవడం లేదంటేనే తిరకాసు ఉన్నట్టు. మరోవక్క మొండిబాకీలు ఆలమూరు బ్రాంచ్‌లో రూ.3.74 కోట్లు, అల్లవరం రూ.2.24 కోట్లు, అమలాపురం రూ.2.91 కోట్లు, అంబాజీపేట రూ.1.38 కోట్లు, అన్నవరం రూ.45.53 కోట్లు, ఆత్రేయపురం రూ.6.86 కోట్లు, దానవాయిపేట రూ.4.78 కోట్లు, ద్రాక్షారామ రూ.7.89 కోట్లు, గండేపల్లి రూ.22.56 కోట్లు, గోకవరం రూ.18.91కోట్లు, గొల్లపాలెం రూ.6.23 కోట్లు, కె.గంగవరం రూ.2.59 కోట్లు, కడియం రూ.2.94 కోట్లు, కరప రూ.3.01 కోట్లు, కాట్రేనికోన రూ.6.70 కోట్లు, కోరుకొండ రూ.8.74కోట్లు, మలికిపురం రూ.2.66 కోట్లు, మామిడికుదురు రూ.2.81 కోట్లు, మండపేట రూ.12.29 కోట్లు, ముమ్మిడివరం రూ.4.96కోట్లు, నాగమల్లితోట రూ.3.94కోట్లు, పి.గన్నవరం రూ.3.13కోట్లు, పెద్దాపురం రూ.43.97 కోట్లు, పిఠాపురం రూ.23.32 కోట్లు, రఘుదేవపురం రూ.37.97 కోట్లు, రాజమహేంద్రవరం రూ.6.48కోట్లు, రాజానగరం రూ.11.27 కోట్లు, రంపచోడవరం రూ.16.14 కోట్లు, రంగంపేట రూ.10.98 కోట్లు, రాయవరం రూ.11.40కోట్లు, సామర్లకోట రూ.5.18 కోట్లు, తుని రూ.16.18కోట్లు, యు.కొత్తపల్లి రూ.9.95 కోట్లు మొండిబాకీలుగా తేల్చారు. వీటి వసూలుకు తాజాగా 9బృందాలను ఏర్పాటుచేశారు.

» ఉమ్మడి తూర్పుగోదావరిలో రూ.980 కోట్లకు చేరిన డీసీసీబీ మొండిబాకీలు

» వసూలు చేయడానికి అధికారుల నానా తంటాలు

» వీటిలో బినామీ రుణాలే అధికం కావడంతో ఏంపాలుపోని పరిస్థితి

» 2019 నాటికి డీసీసీబీ బాకీలు రూ.200 కోట్లే.. వైసీపీ వచ్చాక రూ.980 కోట్లకు

» మార్చి సమీపిస్తుండడంతో తొమ్మిది బృందాలతో వసూళ్లకు ప్రణాళిక

## జిల్లాలో రెండు డెంగ్యూ కేసులు

» ఉప్పలగుప్తం మండలం భట్టుపాలెంలో ఒకటి, రామచంద్రపురంలో మరొకటి

**జిల్లాలో రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఒకటి ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంలో నమోదవగా.. మరొకటి రామచంద్రపురం పట్టణం అంకంవారివీధిలో నమోదైంది.**

ఉప్పలగుప్తం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంలో డెంగ్యూ కేసు నమోదైనట్టు వైద్యాధికారి కె.విష్ణుప్రియ తెలిపారు. గ్రామానికి చెందిన కాటంరెడ్డి హనుమంతరావు(65) అనే వృద్ధుడికి జ్వరం రావడంతో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు. అక్కడ పరీక్షల అనంతరం డెంగ్యూగా నిర్ధారణ అయ్యిందన్నారు. సోమవారం భట్టుపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా ఫీవర్‌సర్వే నిర్వహించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పి.రాజ్‌కుమార్, ఆరోగ్యవిస్తరణాధికారి రాయుడు రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని అంకంవారివీధిలో డెంగ్యూకేసు నమోదుతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.పరిసరప్రాంతాల్లో డీఎంవో ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్‌యువోలు వెంకటేశ్వరరావు, బిషప్‌లు సోమవారం పరిశీలించారు. ఆరోగ్యశాఖ సిబ్బంది డోర్‌టుడోర్ సర్వేచేశారు. డెంగ్యూ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఏరియా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్ఎం రాయుడు సుధారాణి, ఎంపీహెచ్ కామేశ్వరరావు, ఆశావర్కర్ రాణి పాల్గొన్నారు.

# పెరిగినట్టే పెరిగి..

» మళ్లీ సంక్షోభంలోకి కొబ్బరికాయల ధరలు

» రికార్డు స్థాయి నుంచి పతన స్థితికి చేరిన మార్కెట్

» నిర్వహణ వ్యయం పెరిగి, దిగుబడులు తగ్గడమే కారణం

» కుదేలవుతున్న కోనసీమ కొబ్బరి రైతు



కొబ్బరికాయలు ఒలుస్తున్న కార్మికులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కొన్నినెలలుగారికార్డుస్థాయిలో నమోదైన 'కొబ్బరి' ధరల పతనం ప్రారంభమైంది. కొబ్బరి ఉత్పత్తుల ఆధారిత రాష్ట్రాల్లో గణనీయమైన ఉత్పత్తులు పెరగడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి కొబ్బరి ఎగుమతులు భారీగా క్షీణించాయి. ఇదే మార్కెట్ పతనం కావడానికి ప్రధాన కారణమని వ్యాపారులు చెప్తున్నారు. కార్తీకమాసం ముగిసినప్పటికీ మరో మూడు నెలల పాటు మూఢం రావడంతో పండుగలు, శుభ కార్యక్రమాలు లేకపోవడంవల్ల ధరలు పెరిగే పరిస్థితి ప్రస్తుతం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 100కుపైగా లారీలు కొబ్బరి ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేపరిస్థితినుంచి ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఎగుమతులు నిలిచిపోవడంవల్ల కొబ్బరి ధరలు పడిపోయి రైతులు కుదేలయ్యారు.

### పెరిగిన ధరలు.. పతన స్థితికి..

అద్భుత పోషకాలు ఉండే కొబ్బరి ధరలు ఈ ఏడాది ప్రారంభంనుంచి రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు భారీగా పెరగడంతో మన రాష్ట్రంలో ఆశించిన మేర దిగుబడులు లేకపోవడంవల్ల ఉత్పత్తులు తగ్గిపోయాయి. కొన్నినెలల క్రితం అంతర్జాతీయ మార్కెట్‌లో కొబ్బరి నూనె ధరలు పెరగడంతో ఈ ఏడాది కొబ్బరి కాయ వెయ్యింటికీ ధర రూ.27వేల పైబడి లావాదేవీలు జరిగాయి. ఈ ఏడాది జనవరి ప్రారంభంలో రూ.14వేలు ఉన్న కొబ్బరికాయల ధర పెరుగుతూ రికార్డు స్థాయిలో కొనసాగింది.

### మహాకుంభమేళాకు ఇక్కడినుంచి..

జనవరి నెలలో ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాకు మన రాష్ట్రం నుంచి కొబ్బరి ఎగుమతులు జోరుగా జరిగాయి. ఆ సమయంలో కొబ్బరి ధరలు అనూహ్యంగా పెరగడం ప్రారంభించాయి. పచ్చికొబ్బరికాయల ధర అప్పట్లో రూ.16వేలు పెరిగింది. మార్చినెలలో శ్రీరామనవమి సందర్భంగా ధర పెరిగింది. ఆ సమయంలో ఉభయగోదావరి జిల్లాల నుంచి 75 లారీల వరకూ ఎగుమతులు కొనసాగాయి. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో దిగుబడులు లేకపోవడంతో ఆయా రాష్ట్రాలనుంచి ఎగుమతులు అంతంతమాత్రంగా జరిగేవి. దీంతో మన రాష్ట్రంనుంచి కొబ్బరి ఎగుమతులు జోరుగా జరిగేవి. జూన్,జూలై నెలలో పచ్చికొబ్బరికాయల ధర రూ.23వేల వరకూ పెరిగింది. ఆ తర్వాత ఆగస్టు నెలలో కొబ్బరికాయల ధర రూ.18వేలకు పడిపోయింది. ఇతర రాష్ట్రాల్లో పంట దిగుబడి పెరగడంతోపాటు కొబ్బరి ధరలు పెరగడంతో కాయల వినియోగం తగ్గించడంతో ధరలు మరింత తగ్గాయి. తిరిగి సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ధర పెరుగుదల ప్రారంభమైంది.

### నవంబరులో పెరిగి.. మళ్లీ తగ్గి..

నవంబరులో దశమి, దీపావళి పండుగలతో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో రికార్డుస్థాయిలో పచ్చికొబ్బరికాయల ధరలు పెరిగాయి. వెయ్యి కొబ్బరికాయలు రూ.27వేలవరకు ధర పలికింది. దీంతో రైతులు, వ్యాపారులు వ్యక్తం చేసిన ఆనందాలు కొన్నిరోజులు కూడా నిలబడలేదు. ఇతర రాష్ట్రాల్లో కొబ్బరిపంట దిగుబడులు పెరగడంతో క్రమంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల్లో కొబ్బరి దిగుబడి ఊపందుకోవడంతో ఉభయగోదావరి జిల్లాలకు ఆర్డర్లు తగ్గాయి. గతంలో 100 లారీలు ఎగుమతులు జరగ్గా ప్రస్తుతం 40 నుంచి 50 లారీలకు పడిపోయాయి. ఈ ఏడాది ప్రారంభంలో రూ.14వేలు ఉన్న కొబ్బరి ధరలు పెరుగుతూ, తగ్గుతూ ప్రస్తుతం అవే ధరలు కొనసాగుతున్నాయి.

### ఇప్పుడు ధరలిలా..

ప్రస్తుతం కొబ్బరిధరలు ఇలాఉన్నాయి. కొత్త కొబ్బరి(క్వింటాల్) రూ.18వేలు, కొత్త కొబ్బరి (రెండోరకం), కురిడీ కొబ్బరి(పాతవి) గండేరా(వెయ్యి) రూ.28వేలు, గటగట(వెయ్యి) రూ.25వేలు, కురిడీ కొబ్బరి(కొత్తవి) గండేరా(వెయ్యి) రూ.27వేలు,గటగట(వెయ్యి) రూ.24వేలు, నీటికాయ పాత(ముక్కుడు)(వెయ్యి) రూ.15వేల నుంచి రూ.16వేలు, కొత్త(పచ్చి)(వెయ్యి)రూ.14వేలుగా ఉన్నాయి. రానున్న కొన్నినెలలపాటు ఇవే ధరలు కొనసాగొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## హాస్టళ్ల నిర్వహణలో సమస్యలు ఉత్పన్నం కాకూడదు

» సంక్షేమశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ తీరుపట్ల ఏఒక్క ఫిర్యాదు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ వసతిగృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్సీ, బీసీ వసతిగృహాలకు సంబంధించినఅధికారులతో సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల నిర్వహణ తీరువల్ల పిల్లల ఆరోగ్యభద్రత, సురక్షిత తాగునీరు, మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, హెల్త్, ఇన్సూరెన్స్, కిచెన్ గార్డెన్స్ నిర్వహణ వంటి అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ప్రతి హాస్టల్ పరిధిలో పంచాయతీరాజ్ లేదా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌నుంచి ఒక పారిశుధ్య కార్మికుడిని పొరుగుసేవల విధానంలో నియమిస్తామన్నారు. హాస్టళ్లలో నిర్వహిస్తున్న 18రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్ అనేది అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని అన్నారు. ఎక్కడా వ్యత్యాసాలు లేకుండా వీటిని నిర్వహించి వసతిగృహాలను హైజినిక్ కండిషన్లలో నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. సిబ్బందికి ముఖఆధారిత హాజరు వేయించాలని, నాల్గో తరగతి ఉద్యోగులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, హెల్త్ ఇన్సూరెన్సు అమలుపై కలెక్టర్ సమీక్షించారు. హాస్టళ సంక్షేమశాఖ అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

## క్వాయర్ పాలసీలను అధ్యయనం చేయాలి

» కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ, తమిళనాడు క్వాయర్ పాలసీలపై క్షుణ్ణంగా అధ్యయనంచేసి ఏపీకి అనువైన క్వాయర్ పాలసీ రూపకల్పన చేయనున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు.సోమవారం కలెక్టరేట్‌లో క్వాయర్ బోర్డు, ఉద్యాన, పరిశ్రమల అధికారులతో క్వాయర్ పరిశ్రమల ప్రతినిధులతోను సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోకోపిట్ క్వాయర్ ఫైబర్ జియో టెక్స్‌టైల్స్ డోర్ మేట్ల తయారీ తదితర ఉత్పత్తులపై సమగ్రంగా అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు. క్వాయర్ పరిశ్రమల బ్యాక్‌గ్రౌండ్, పరిశ్రమల్లో కలిగే లాభార్జన, నేషనల్ ఫైబర్‌పాలసీ, మేజర్ పాలసీ, ఇంట్రారాక్షన్స్, ఫైనాన్సింగ్ రిక్వైర్‌మెంట్, పీఎం ఉపాధి కల్పనవల్ల కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై చర్చించారు. జేసీ నిషాంతి, జిల్లాఉద్యానశాఖ అధికారి రమణ, పరిశ్రమల కేంద్ర మేనేజర్ అరుణ పాల్గొన్నారు.

### సీఎస్‌తో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్

విశాఖ ఎకనమిక్ ప్రాంతీయ జోన్‌లో ఆర్థికంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి వ్యవసాయ అనుబంధ రంగాలు, టూరిజం, ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి, ప్రతిఇంటికి ఒక పారిశ్రామికవేత్త నినాదాలకు అనుగుణంగా అన్నివిధాలా ప్రోత్సాహానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతినుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్సు జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆర్థిక ప్రాంత జోనల్‌లో ఉన్న అభివృద్ధి అంశాలపై జిల్లాలవారీగా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎకనామిక్ జోనల్ రీజన్‌లో ఫుడ్ ప్రాసెసింగ్, క్వాయర్ పరిశ్ర మలు, వ్యవసాయఅనుబంధ రంగాలు,టూరిజం పరంగా అవకాశాలు ఉన్నాయన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని సహకార ఉద్యోగుల ధర్నా



అమలాపురం డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట సహకార ఉద్యోగుల ధర్నా

అమలాపురంటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీ బ్రాంచి కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టినట్టు జేఏసీజిల్లా శాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు తెలిపారు. జిల్లాలోని 166 సొసైటీల్లో 510 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. జిల్లాలోని 22 డీసీసీబీ బ్రాంచి కార్యాలయాల వద్ద ఉద్యమ కార్యాచరణలో భాగంగా చేపట్టిన ధర్నాలు విజయవంతమయ్యాయన్నారు. అమలాపురం డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఉద్యోగులు జీవో36ను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62ఏళ్లకు వయో పరిమితి పెంచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సొసైటీల సీఈవోలు పి.దొరాజీ, వి.దుర్గాప్రసాద్, ఎల్.సూర్యనారాయణ, వీఎస్ శ్రీనివాసరావు, వై.శివ, బి.సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, వై.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.







ఎంతో మంది కలలుకనే విద్యా ప్రపంచం అది.
ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆలయం అది.
ఒక్కసారి సీటు వస్తే చాలు విద్యార్థి భవిష్యత్తుకు
ధోకా ఉండదని భరోసా ఇచ్చే పాఠశాల.
ఉన్నత ప్రమాణాలను అనుసరిస్తూ ఉత్తమ విలువలతో
విద్యా బోధనతో పాటు విద్యార్థులను
అన్ని రంగాల్లో తీర్చిదిద్దే బడి...
అదే జవహర్ నవోదయ విద్యాలయ.






## ఇక్కడ చదివితే
# నవోదయమే

- సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు
- అత్యుత్తమ ప్రమాణాలతో విద్యా బోధన
- పేద, మధ్య తరగతి విద్యార్థులకు గొప్ప అవకాశం
- ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న పరీక్ష

(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

● కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో నవోదయ పాఠశాలను 1988లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.

● ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య అందిస్తారు. కార్పొరేట్ పాఠశాల స్థాయి వసతుల మధ్య నిపుణులైన ఉపాధ్యాయులు బోధిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈ పాఠశాలలో ఇంటర్ ఎంబైపీసీ చదివే అవకాశం ఉంది.

● బాలబాలికలకు వసతిగృహాలు, భోజనం, విద్య, నోట్ బుక్స్, యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి ఉచితం.

● శాస్త్ర సాంకేతికతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వవికాసం కల్పిస్తారు.

● కంప్యూటర్ కోర్సులతో పాటు సంగీతం, డ్రాయింగ్, క్రాఫ్ట్, నృత్యం వంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు.

● ఇక్కడ త్రిభాషా సూత్రం అమలుచేస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలపై విద్యార్థులకు పట్టు లభిస్తుంది. వీటిలో చేరేందుకు పోటీ ఎక్కువగా ఉంటుంది.

● విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఇస్తారు. సమ యపాలన, నిబద్ధత, నైతిక విలువలు నేర్పిస్తారు. ప్రాథమిక సైనిక శిక్షణ, మ్యాప్ రీడింగ్, కమ్యూనికేషన్, ఫైరింగ్ అంశాలు ఉంటాయి. సామాజిక సేవా కార్యక్రమాలు, సాహస కార్యకలాపాలైన పెరేడ్లు, ర్యాలీలు, సాహస శిక్షణ, టీమ్ లీడింగ్, సమయపాలన అభివృద్ధి చేస్తారు.

జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 7,170 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష నిర్వహణకు 32 కేంద్రాలు కేటాయించారు. ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది.... పరీక్ష రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మీకోసం...

### మూడు విభాగాల్లో పరీక్ష...

ప్రవేశ పరీక్ష సమయం రెండు గంటలు. వంద మార్కులకు వంద ప్రశ్నలు మూడు విభాగాల్లో ఉంటాయి. ప్రతి విభాగంనూ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. రీజనింగ్ (మేధాశక్తి)లో 50 మార్కులకు 40 ప్రశ్నలు, తెలుగు భాష పరీక్షలో ఐదు అంశాల్లో ఒక్కో అంశానికి నాలుగు మార్కులు చొప్పున 25 మార్కులు ఉంటాయి. ఇంగ్లిషు, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇస్తారు.

ఎక్కువ మార్కులు ఏ విభాగంలో అంటే..

మేధాశక్తి విభాగంలో 40 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులు ఉంటాయి. విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికితీసేలా ఇవి ఉంటాయి. బొమ్మలతో కూడిన ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. ఈ ప్రక్రియలో సులభంగా మార్కులు పొందడానికి విద్యార్థులు సమయస్ఫూర్తితో ఆలోచించాల్సి ఉంటుంది. బొమ్మలను జాగ్రత్తగా గమనిస్తే తక్కువ సమయంలోనే సమాధానాలు గుర్తించవచ్చు. నవోదయ దరఖాస్తుతో పాటు పంపిణీ చేసిన సమాచారంలో ప్రతి విభాగానికి చెందిన నమూనా ఉంటుంది. దీన్ని పరిశీలించి శ్రద్ధగా అభ్యాసం చేస్తే ఈ విభాగంలో సులువుగా 45 మార్కులు పొందే అవకాశం ఉంది.



**గణితంలో ఇలా...**

గణిత విభాగంలో 20 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కుల వంతున 25 మార్కులు ఉంటాయి. ఐదో తరగతి వరకు గల అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు చొప్పున ప్రశ్నలు అడుగుతారు. గణితంలో అధిక మార్కులు సంపాదించగలిగే విద్యార్థులు దాదాపుగా నవోదయలో సీటు పొందుతారు. సులభంగా మార్కులు సాధించేందుకు ప్రధాన గణిత సూత్రాలు నేర్చుకోవాలి. అంతేకాక 5 అంశాల ఆధారంగానే 25 ప్రశ్నలు ఉంటాయి.

**భాషా పరీక్ష ఇలా..**

విద్యార్థుల భాషా పఠనాసక్తిని అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ప్రశ్నలు 25 మార్కులకు ఉంటాయి. ఈ విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. ఒక్కో పాఠ్యాంశంలో నాలుగు ప్రశ్నల వంతున ఐదు పాఠ్యాంశాల్లో 25 మార్కులు ఉంటాయి. పాఠ్యాంశాల ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు అన్నీ ఒకేలా ఉంటాయి. నిశితంగా గమనిస్తే సమాధానం కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుంది.

### ఉన్నత ప్రమాణాలతో ..

ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 75 శాతం గ్రామీణ ప్రాంతం వారికి, 25 శాతం నగర వాసులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధిస్తే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి, కార్పొరేట్ స్థాయి వసతులు ఉంటాయి.

### ఏర్పాట్లు పూర్తి చేశాం



ఉమ్మడి జిల్లాలోని 32 కేంద్రాల్లో ఈ నెల 13న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీ యింగ్‌ను నిరోధించేందుకు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నాం. ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

**బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపల్**

### ఈ సూచనలు పాటించండి...

● పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్ టికెట్, ప్యాడ్, నీలం, నలుపు రంగు పెన్నులు తీసుకువెళ్లాలి.

● ప్రశ్నపత్రంలో అన్ని పేజీలు ప్రింట్, క్రమ సంఖ్య, మీడియం సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.

● పరీక్ష కేంద్రానికి అరగంట ముందు వెళ్లాలి.

● జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా గమనించాలి. పేరు, హాల్ టికెట్ నెంబరు రాయాలి.

● జవాబు పత్రంలో ఎంచుకున్న సంఖ్యను బాక్సులో మధ్యలో సరిగా కనిపించేలా రాయాలి.

● జవాబు పత్రంలో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

● ప్రతి విభాగంలోనూ కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి.

## రాజమహేంద్రవరం నాకు
# సెకండ్ హోమ్

- గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయత మరువలేనివి
- 350కి పైగా సినిమాల్లో నటించా
- నాకు ప్రేరణ విజయనిర్మల
- 'ఆంధ్రజ్యోతి'తో సహజ నటి జయసుధ



**గోదావరి జిల్లాల ప్రజలు చూపించే ఆప్యాయత, ఆదరణ ఎనలేనివి... రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్ లాంటిది... అన్నారు సహజ నటి జయసుధ. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన ఆమె సోమవారం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.**

**గోదావరి జిల్లాలతో మీ అనుబంధం?**

1975-80 మధ్యలో గోదావరి జిల్లాల్లో షూటింగ్‌లకు వస్తే ఉండేందుకు సరైన హోటల్ సదుపాయం ఉండేది కాదు. కానీ గోదావరి జిల్లాల ప్రజలు మమ్మల్ని వారి సొంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు. వారి ఆప్యాయత మరువలేము.

**మీ సొంత ఊరు?**

మా నాన్నగారిది తిరుపతి. అమ్మమ్మగారిది విజయనగరం. అయితే నాకు రాజమ హేంద్రవరం సెకండ్ హోమ్ లాంటిది. ఇక్కడి ప్రజలు చాలా ప్రేమగా, గౌరవంగా చూసుకునేవారు. ఆ రోజులు వేరు. అవి గోల్డెన్ డేస్. నాకు కోస్తా ప్రాంతంలో ఫ్యాన్ ఫాలోయింగ్ వుంది.

**సినీ పరిశ్రమలో నాటికీ, నేటికీ వచ్చిన మార్పులు?**

చాలా ఆధునిక పరిజ్ఞానం వచ్చింది. అనేక మార్పులు వచ్చాయి. ఎంతో మందికి అవకాశాలు వస్తున్నాయి. కొత్త నటీనటులు వస్తున్నారు. బాగా చేస్తున్నారు. ఓటీటీ రంగ ప్రవేశం చేసింది.

**మీరు ఇప్పటివరకు ఎన్ని సినిమాలు చేశారు?**

350కు పైగా సినిమాలు చేశాను. అనేక పాత్రలు సంతృప్తి ఇచ్చాయి. కుటుంబ కథా చిత్రాలు బాగా పేరుతెచ్చాయి. నాడు అగ్రనటులతో నటించాను. నేటి అగ్రనటులకు తల్లి పాత్రలు పోషించాను. 25ఏళ్ల తర్వాత మలయళం సినిమా చేస్తున్నాను. ఏ రోల్‌పడితే అది చేయను.

**ప్రస్తుతం రాజకీయాలపై ఇంట్రస్ట్ వుందా?**

గతంలో నేను తెలంగాణలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా చేశాను. ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేను. ఈ వయసులో రాజకీయాలకు సూట్ అవుతానా లేదో చూడాలి. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. రోల్ అనేది ముఖ్యం. అది ప్రామిస్ చెయ్యలేకపోయినపుడు ఉండలేము. రోజూ పని అనేది ఉండాలి. స్మృతిఇరానీలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

**మీరు సినీ రంగంలోకి రావడానికి ప్రేరణ?**

ఇది చిన్నప్పటి విషయం. గూగుల్‌లో కూడా తప్పులు ఉన్నాయి. నేను 12వ ఏట సినీ పరిశ్రమలోకి వచ్చాను. మా ఆంటీ విజయ నిర్మల గారు నన్ను తీసుకువచ్చారు. ఆమె నాకు ప్రేరణ. ఎన్నో సినిమాలు చేశాను. ఆనందంగా ఉంది.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

# అమ్మ .. అనే పిలుపులో ఎంతో మాధుర్యం

- దేశంలో ఉన్నత స్థానంలో ఉన్నవారంతా మాతృభాషలో చదివిన వారే
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మమ్మీ, డాడీ అనే పిలుపు మంచిది కాదు.. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మమ్మీలో ఉండదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీకి చెందిన భారతీయ భాషాసమితి సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే కార్యశాలను వెంకయ్యనాయుడు సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షత వహించిన ఈ సభలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మమ్మీ అనేది పెదవుల నుంచి వస్తుందని, అమ్మ అన్న పిలుపు మన అంతరాళం నుంచి వస్తుందన్నారు. కావాలంటే ఇంటికి వెళ్లాక పరిశీలించుకోవాలని చెప్పారు. ఇంగ్లీషు వారి పాలనలో బలవంతంగా మన మీద ఇంగ్లీషు రుద్దడమే కాకుండా, ఇంగ్లీషులో మాట్లాడితేనే ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇంగ్లీషు నేర్చుకోవలసి వచ్చిందని చెప్పారు. మనం కూడా మాతృభాషలో చదివితేనే ఉద్యోగం అనే విధంగా ఉండాలన్నారు. మాతృభాషలో మాట్లాడడం అందరూ అలవరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ గుజరాతీ భాషలోనూ,రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తన మాతృభాష ఒడియాలోనే చదివారని, సుప్రీంకోర్టు పూర్వ ప్రధానన్యాయమూర్తి ఎన్వీ రమణ, తాను మాతృభాష తెలుగులో చదువుకున్నామని చెప్పారు. దేశంలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నారని ఆయన స్పష్టంచేశారు. ప్రాథమిక విద్య, పరిపాలనా భాష మాతృభాషే కావాలని.. న్యాయస్థానాల్లో వాదప్రతివాదనలు, తీర్పులు కూడా మాతృభాషలోనే జరగాలన్నారు. తిట్టు కూడా తెలుగులో ఎంతో బాగుంటుందన్నారు. మన భాష, యన యాస, మనపాట, మన ఆట, మన గోస కాపాడుకోవాలని అన్నారు. నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భాష ఒక నిత్యప్రవాహిని, ఒక జీవనది, తరాల తోపాటుగా కాలానుగుణంగా అవసరాలకు తగినట్టుగా మారుతూ ముందుకు సాగుతూ ఉంటుందన్నారు. భాషను విభిన్న శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వాడకానికి అనువుగా మలుచుకోవడానికి, నూతనపదజాల సృష్టికి ఒక ప్రణాళికను తయారు చేసుకోవడం శ్రేయోదాయకమన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎస్పీ, సైకాలజిస్ట్ నామగిరి బాబ్జీ రచించిన హేండ్ బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్‌ది రోల్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ పుస్తకాన్ని, నన్నయ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ సహాయాచార్యుడు మల్లిభాస్కర్ రచించిన మస్తాన్‌బాబు జీవనచిత్రం శిఖరాగ్రి మల్లి పుస్తకాన్ని, నర్సరీ రైతు పుల్లా సత్యనారాయణ రచించిన ధరణీపుత్రులు పుస్తకాలను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తొలుత నన్నయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం వద్ద వీసీ ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సభానంతరం వెంకయ్యనాయుడును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నన్నయ తెలుగుశాఖసహాయాచార్యుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ స్వాగతం పలుకగా, జాతీయ కార్యశాల కోఆర్డినేటర్ తలారి వాసు కార్యశాల ఉద్దేశం వివరించారు. తెలుగు- సంస్కృత అకాడమి అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) మాట్లాడుతూ వైజ్ఞానిక, విజ్ఞానం ప్రతిబించేవిధంగా మ్యాగజైన్‌లు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి ప్రముఖుల మోనోగ్రాఫ్ పుస్తకాలు తీసుకురాబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో తానా పూర్వాధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయభాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు



కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు

## సింహాచల క్షేత్రానికి సంపెంగ మొక్కలు

కడియం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహా లక్ష్మీ నరసింహ దేవస్థానానికి కడియపులంకకు చెందిన దుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ఉచితంగా సంపెంగ మొక్కలు పంపించారు. గతంలో కూడా శ్రీనివాస్ సంపెంగ మొక్కలు అందజేశారు. అలాగే హుద్‌హుద్ తుఫాన్ సమయంలో నేల కొరిగిన సంపంగి చెట్ల స్థానంలో వీటిని మళ్లీ నాటనున్నట్టు దేవస్థానం సూపరింటెండెంట్ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ, గెడ్డం ఆది నారాయణ, పెద్దిరెడ్డి శ్రీను, చల్లా దుర్గారావు, బాదం పెదకాపు, తదితరులు పాల్గొన్నారు.



లారీలో మొక్కలు పంపుతున్న రైతు శ్రీనివాస్

## 'భట్నవిల్లి'లో లక్ష్మీ హ్యుందాయ్ భారీ షోరూమ్

- జ్యోతిప్రజ్వలన చేసిన రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్ , చిత్రంలో సంస్థ చైర్మన్ కంభంపాటి , కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు

అమలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి జంక్షన్ సమీపంలో ఏర్పాటైన లక్ష్మీ హ్యుందాయ్ భారీ షోరూమ్‌ను సోమవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అతిథులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. తొలుత మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో లక్ష్మీ హ్యుందాయ్ చైర్మన్ కంభంపాటి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్సీ, కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్, బీజేపీ కిసాన్ జాతీయ నాయకుడు నల్లా పవన్‌కుమార్, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, ఎం.గోపాలకృష్ణరాజు, పెన్మెత్స జగప్పరాజు, వైసీపీ నేత పీకే రావుతో పాటు పలువురు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు పాల్గొన్నారు. లక్ష్మీ హ్యుందాయ్ గ్రూపు రాజమహేంద్రవరం ఆపరేషన్స్ హెడ్ సునీల్‌కుమార్, సేల్స్ మేనేజర్ సత్యమూర్తితో పాటు పట్టణంలోని టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీకి చెందిన రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నో అత్యాధునిక సౌకర్యాలతో ఈ షోరూంను ప్రారంభించడం జరిగిందని కస్టమర్లకు అత్యంత విలువైన సౌకర్యాలను ఈ షోరూమ్ ద్వారా అందించడం జరుగుతుందని చైర్మన్ కంభంపాటి తెలిపారు. సేల్స్, సర్వీస్, బాడీ షాప్, యాక్సరీస్, స్పేర్ పార్ట్స్ వంటి అన్నిరకాల సేవలు కోనసీమ జిల్లా షోరూంలో అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు తెలిపారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రితో పాటు ఇతర నేతలందరికీ ఆపరేషన్ హెడ్ సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్లా శ్రీధర్, ఆర్డీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక సౌరభం .. గోదావరి తీరం

- ప్రముఖ రచయిత, నటుడు ఎల్‌బీ శ్రీరామ్



షూటింగ్‌లో పాల్గొన్న ఎల్‌బీ శ్రీరామ్

ధవళేశ్వరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరం సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయమని ప్రముఖ రచయిత, సినీ నటుడు ఎల్‌బీ శ్రీరామ్ పేర్కొన్నారు. సోమవారం ధవళేశ్వరంలోని రామపాదాలరేవు సమీపం గోదావరి నది ఒడ్డున జరిగిన టెలీ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో ఈయన ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఈనెల 15న కడియంలో జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమానికి రావాలని కోరుతూ కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, చల్లపిళ్ల కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు ఆహ్వానించారు.

# కోటి తలంబ్రాల పంటకు వానర హారతి

- గోకవరం మండలం అచ్యుతాపురంలో నిర్వహణ
- గోటి కోటి తలంబ్రాలకు ధాన్యం సిద్ధం

గోకవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామతత్వాన్ని ప్రచారం చేయడంలో భాగంగా గోకవరం మండలం అచ్యుతాపురంలో సోమవారం 15వ కోటి తలంబ్రాల జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి తలంబ్రాలకు వానరహారతి అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీరామతత్వాన్ని ప్రచారం చేస్తున్న కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో ఈ జ్ఞానయజ్ఞం కొనసాగుతోంది. విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే సద్భావంతో తొలుత విత్తనాలకు భద్రాచలం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పూజలు చేయించిన అనంతరం అక్కడ నుంచి అచ్యుతాపురం తీసికొచ్చి కల్యాణం చక్రవేణి పొలంలో చల్లడం జరిగింది. క్రమంలో పండిన పంటకు వానర హారతి చేపట్టారు. అనంతరం రామభక్తులు వానరవేషంలో( రాముడు, సీత, ఆంజనేయుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు) పంటను కోసి కుప్పవేసి సీతరామ అష్టోత్తర శతనామస్తోత్రం, హనుమాన్ చాలీషా పారాయణం చేశారు. కోటి తలంబ్రాల కోసం సేకరించిన ధాన్యాన్ని 5 రాష్ట్రాలలో 5 వేల మందిచే గోటితో ఒలిపించి కోటి తలంబ్రాలను సిద్ధం చేయనున్నట్టు అప్పారావు తెలిపారు. 15వ సారి భద్రాచలం, 8వ సారి ఒంటిమిట్ట, 4వ సారి అయోధ్యకు గోటి కోటి తలంబ్రాలను పంపడంలో భాగంగా కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన వివరించారు.





అచ్యుతాపురంలో ధాన్యం సిద్ధం చేస్తున్న వానర వేషధారులు

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను
## అడ్డుకునేందుకే కోటి సంతకాల సేకరణ : బొత్స

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే సంకల్పంతో వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నదని, దాన్ని అడ్డుకోవడానికే కోటి సంతకాల సేకరణ చేపట్టామని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి బొత్స

# తాడువాయి... మరో మాట లేదోయ్!



పోలవరం నిర్వాసితులకు పునరావాసం కేంద్రం అక్కడే..

వెళ్లడం ఇష్టంలేనివారి గురించి తర్వాత ఆలోచిస్తాం

ఐటీడీఏ పీవో మాటలు..


నిర్వాసితుల్లో రేగిన గుబులు

ఇటీవల కోయలగూడెంలో భూములు సందర్శించడానికి వెళ్లిన నిర్వాసితులు

కూనవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతానికి గిరిజనేతరుల పోలవరం నిర్వాసితులకు మరో ప్రత్యామ్నాయం లేదు. మీకు ఏలూరు జిల్లా తాడువాయిలోనే పునరావాసం.. ఒకవేళ కొంతమందికి అక్కడికి వెళ్లడం ఇష్టం లేకపోతే వారి గురించి తర్వాత ఆలోచిస్తాం.. అంటూ సాక్షాత్తూ చింతూరు ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేకాధికారి శుభం నోక్వాల్ ఇటీవల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తేల్చిచెప్పడంతో నిర్వాసితులకు గుబులు రేగింది. అల్లూరి జిల్లా కూనవరం మండలంలో 9 ప్రాధాన్య గ్రామాలను గుర్తించి ప్రభుత్వం పోలవరం పరిహారం ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఇప్పటికే ఆ గ్రామాలకు ఇళ్లకు సంబంధించిన పరిహారం బ్యాంకు ఖాతాలో జమవుతుంది. అయితే 7 గ్రామాలకు పునరావాస ప్రక్రియ సజావుగా సాగుతున్నా కూనవరం, టేకులబోరు గ్రామాల్లో అధికారుల తప్పిదం కారణంగా చిక్కుముడి ఏర్పడింది. ఈ గ్రామాల ప్రజలకు మొదటిగా తాడువాయి పునరావాస కేంద్రమంటూ కొంతమందిని బస్సుల్లో తీసుకెళ్లి చూపించారు. కొంత మంది అంగీకారం తెలపగా మరికొంతమంది వ్యతిరేకించారు. కొంతకాలం తర్వాత వ్యతిరేకించిన వారికి కోయిలగూడెం గ్రామాన్ని చూపించారు. దీంతో మిగతావారు ఆ గ్రామానికి అంగీకారమంటూ అధికారులకు చెప్పారు. ఇప్పుడు కోయిలగూడెం గ్రామం పునరావాస కేంద్ర జాబితాలోలేదని కేవలం తాడువాయి మాత్రమే పునరావాస కేంద్రమని మండలంలో ప్రతీ ఒక్కరూ తాడువాయి గ్రామాన్నే ఎంచుకోవాలని అధికారులు చెప్పడంతో నిర్వాసితులు కంగుతిన్నారు. తమను బస్సుల్లో తీసుకెళ్లి కోయిలగూడెం గ్రామాన్ని ఎందుకు చూపించారని అక్కడ పునరావాసం కల్పిస్తామంటూ అధికారులు చెప్పిన మాట వాస్తవం కాదా అప్పుడు జాబితాలో ఉన్న గ్రామం ఇప్పుడు ఎందుకు లేదని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. అయితే పొరపాటు జరిగిందని, కోయిలగూడెంలో పునరావాసం కల్పించలేమని సాక్షాత్తు ఐటీడీఏ పీవో ఇటీవల జరిగిన సమావేశంలో తేల్చిచెప్పారు. అయితే ఇక్కడ నిర్వాసితులకు తాడువాయిలోనే పునరావాసం కల్పిస్తామని మరెక్కడా ప్రస్తుతానికి పునరావాసం లేదని పీవో చెప్పారు. ప్రత్యామ్నాయం వెతుక్కునే వారి గురించి తర్వాత ఆలోచిస్తామన్నారు. దీంతో కొంత మంది గత్యంతరం లేక తాడువాయినే పునరావాస కేంద్రంగా ఎంచుకుంటున్నారు.

### పీవో సీసీతో సమావేశం ఏంటి?

తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం జరిగిన నిర్వాసితుల సమావేశానికి ఐటీడీఏ పీవో రాకుండా ఆయన సీసీ సమావేశం నిర్వహించడంతో నిర్వాసితుల నుంచి విమర్శలు వస్తున్నాయి. జీవనమరణ సమస్యలు వంటి పరిహారం విషయంలో జవాబుతనం లేని అధికారులను పంపించడం ఏంటని నిర్వాసితులు అంటున్నారు. ఐటీడీఏ పీవో కానీ, సంబంధిత అధికారులు కానీ వచ్చి నిర్వాసితుల కష్టాలు తెలుసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పునరావాసంపై మరోసారి ఐటీడీఏ పీవో కూనవరంలో గ్రామసభ నిర్వహించనున్నారు. ఈ సభలోనైనా నిర్వాసితులకు స్పష్టమైన హామీ రావాలని వారు కోరుతున్నారు.



## సూర్యకిరణం.. సింహభాగం..



గోదావరి.. ఆపై సూర్యాస్తమయం ఎంతో బాగుంటుంది. యానాం రాజీవ్ గాంధీ బీచ్ గౌతమీ గోదావరి ఒడ్డున సాయంత్రం సమయంలో కిరణాలు గోదావరిపై పడినప్పుడు.. అక్కడే ఉన్న సింహం బొమ్మ నోటి భాగాన సూర్యుడు ఉన్నట్టు కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా..

- యానాం (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌లో

## ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

పీడీజే గంధం సునీత ఆదేశం

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్దసంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో సోమవారం ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారంతోపాటు తగు పరిహారం అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

## చేబ్రోలులో వైద్య, ఆరోగ్య శాఖ ఆర్డీ విచారణ



ఆర్డీ డాక్టర్ పద్మ శశిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీని వైద్య, ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) డాక్టర్ పద్మ శశిధర్ సోమవారం పరిశీలించారు. ఈనెల 2న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి ఉండడంతో సకాలంలో వైద్యం అందక శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం మృతిచెందాడు. అదేరోజు కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్ విచారణ చేసి డాక్టర్ సాయిరతన్‌ను సస్పెండ్ చేసి స్టాఫ్ నర్సుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఇదే విషయంపై డాక్టర్ పద్మ శశిధర్ పూర్తిస్థాయిలో ఆసుపత్రిని తనిఖీ చేసి ఆ రోజు జరిగిన సంఘటనపై విచారణ చేశారు. టీడీపీ, జనసేన నాయకులు ఆసుపత్రిలో సమస్యలపై ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. డీఎంహెచ్‌వో పీహెచ్‌సీకి వైద్య సిబ్బంది సక్రమంగా నియమించకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు ఎదురవుతున్నాయని ఆమెకు వివరించారు. సిబ్బంది డిప్యూటేషన్ రద్దు చేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ ఘటనలో డాక్టర్‌పై చర్యలు తీసుకోవడం సరికాదని ఆర్డీ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని కోరడంతో.. ఆవిధంగా వినతిపత్రం ఇచ్చారు. డీఎం అండ్‌హెచ్‌వో నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## మహిళ మెడలో బంగారు ఆభరణం చోరీ

కేసు నమోదు

అమలాపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సినిమా రోడ్డులో ఉన్న శుభకలశం సెంటర్‌లో నివాసం ఉంటున్న గుబ్బల చంద్రావతి తెల్లవారుజామున టాయిలెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మెడలో ఉన్న 3 కాసుల బంగారు ఆభరణాన్ని దొంగ అపహరించుకుపోయాడు. చంద్రావతి ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:244605

4 Lines CLASSIFIED Rs.230/- Only

## చింతూరులో స్క్రబ్ టైఫస్ కేసు

బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి

చింతూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరులో స్క్రబ్ టైఫస్ కేసు నమోదైనట్టు సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కోటిరెడ్డి తెలిపారు. బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి. వ్యాధి లక్షణాలను గుర్తించిన తదుపరి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈక్రమంలో బాధితుడు స్క్రబ్ టైఫస్ వ్యాధిన బారిన పడినట్టు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొనేందుకు కిట్లు అందుబాటులో ఉన్నాయని.. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందాల్సిందిగా డా.కోటిరెడ్డి సూచించారు.

## ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి



చిన గంగరాజు(ఫైల్)

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులో ఆటో బోల్తా పడి డ్రైవర్ మరణించాడు. గ్రామానికి చెందిన కోరగంటి చిన గంగరాజు(38) రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. గ్రామంలో పని ఉండడంతో ఆది వారం రాత్రి చేబ్రోలు వచ్చాడు. ఇంటి వద్ద తినడానికి ఏమైనా తెమ్మని చెప్పడంతో ఆటో తీసుకుని చేబ్రోలు-మల్లవరం రోడ్డుకు వెళ్లగా అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన గం గరాజును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. గంగరాజు టీడీపీలో క్రియాశీలకంగా ఉండటంతో పాటు సాయిరామ్ ఆటో యూనియన్ సభ్యుడిగా ఉన్నారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నప్రసాద వితరణలో

## భక్తులకు ఇబ్బందులు ఉండకూడదు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం దేవస్థానం అధికారులకు పలు సూచనలు

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు స్వామి దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసే సమయంలో వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో దేవస్థానం ఈవో సుబ్బారావు, అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ కలిశారు. హాల్‌లో భక్తులకు నిరీక్షణ లేకుండా అన్నప్రసాదం రుచి, శుచిగా అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత క్యూలైన్ ఇరుకుగా ఉందని దానిని నూతన భవనం పూర్తయ్యే సమయం వరకు తాత్కాలిక పద్ధతిలో విశాలంగా విస్తరించాలన్నారు. నూతన మరుగుదొడ్ల నిర్మాణ విషయంపై చర్చించారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన చింతా అవినాస్ దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఉన్నారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు

## న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒడిసా అండర్-2025 మాస్టర్స్-2025 బ్యాడింట్మన్ వరల్డ్ ఫెడరేషన్ టూర్ హండర్డ్ అంతర్జాతీయ టోర్నమెంట్‌కు న్యాయ నిర్ణేతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి సోమవారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు ఒడిసాలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఒడిసా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరుగుతుంది. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్-2 నేషనల్ ఎంపైర్ అయిన శ్రీనివాసరావు ప్రస్తుతం నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ టర్నమెంట్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు మరోసారి న్యాయనిర్ణేతగా నియమితులైన శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాలు, కేఎస్‌డీఏ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఉపాధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బీవీసీ సంస్థల అధినేత బోనం కనకయ్య, గంధం పల్లంరాజు తదితరులు అభినందించారు.



పాయసం శ్రీనివాసరావు

# తూకం.. మోసం!

చేబ్రోలు పట్టు మార్కెట్‌లో తూనికల మోసం

100 కిలోలకు 2.50 కిలోల తరుగు

పట్టు రైతుల ఆందోళన



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆందోళన చేస్తున్న పట్టు రైతులు



50 కిలోల తూనికల రాళ్లు వేస్తే 48.88 కిలోలు మాత్రమే చూపిస్తున్న మిషన్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూనికల విషయంలో మోసం జరుగుతుందంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. పట్టు మార్కెట్‌లో ఉన్న వెయింగ్ మిషన్‌ను మూడు సంవత్సరాలుగా తూనికల కొలతల శాఖకు తనిఖీల నిమిత్తం పంపకుండా పట్టు పరిశ్రమల శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. దీని వల్ల పట్టుగూళ్ల బరువు 100 కిలోలకు 2.50 కిలోలు తక్కువగా చూపిస్తున్నదని తెలిపారు. 50కిలోల తూకం రాళ్ల తీసుకువచ్చి మిషన్‌పై వేయగా 48.88 కిలోలు మాత్రమే చూపించడాన్ని వారు గుర్తించారు. తూకంలో మోసంతో తాము లక్షలాది రూపాయిలను నష్టపోయామని, దీనికి బాధ్యులైన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారమ్, పిఠాపురం పట్టణంలోని పాడా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతులు సీహెచ్.చక్రబాబు, రామకృష్ణ, ఉలవకాయల రాంబాబు, నల్లరావుల ఏసుబాబు, ఓ.ఏసుబాబు, గంగాధర్, శ్రీను, రామారావు, సూరిబాబు, శివ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## మూసివేసిన చర్చిలను తెరిపించాలి

కాకినాడ కలెక్టర్‌ను కోరిన గొల్లప్రోలుకు చెందిన పాస్టర్లు



కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల పాస్టర్లు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పరిధి కొత్తపేటలో మూసివేసిన చర్చిలను తిరిగి తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు సోమవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా క్రైస్తవ పాస్టర్లు, ప్రతినిధులు జేమ్స్, జాన్‌వెస్లీ, గుడాల శాంతి, పెంకే శ్రీను, ఇజ్రాయల్, రాజు, ఎలియాజర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా నడుస్తున్న చర్చిలను హిందూ సంఘాలు ఆందోళన నేపథ్యంలో మూసివేయడం తగదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలకు వారి భావాలను వ్యక్తపర్చే హక్కులు ఉన్నాయన్నారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో చర్చిలు నిర్వహిస్తుంటే మూసివేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా దీనిపై విచారణ నిర్వహించి చర్చిలు తిరిగి ప్రారంభించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పాస్టర్లు, క్రైస్తవులు వెల్లడించారు.

గొల్లప్రోలులో

## కొనసాగుతున్న పోలీసు పికెట్

ప్రార్థనా మందిరాల వద్ద సర్వే

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన తదనంతరం పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొత్తపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా రెండు చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లతో ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ హిందూ సంఘాలు ఆందోళనకు దిగడం, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అక్కడ పర్యటించి చర్చిల కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇరువర్గాలు అక్కడ మోహరించిన నేపథ్యంలో కొత్తపేటలో నిషేధాజ్ఞలు విధించి అమలు చేస్తున్నారు. ఆర్డీవో ఆదేశాలు మేరకు ప్రార్థనా మందిరాలు ఉన్న ప్రాంతంలో నగర పంచాయతీ టీపీవో నీలిమాదీప్తి ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించి కొలతలు సేకరించారు. వీటికి అనుమతులు ఎలా తీసుకున్నారు, ఆక్రమణలు ఉన్నాయా లేదా తదితర అంశాలను ఆర్డీవోకు నివేదించనున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని గొల్లప్రోలు తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



గొల్లప్రోలు కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్

## ప్రిన్సిపల్ జిల్లా కోర్టుల ఏర్పాటుపై హైకోర్టు జడ్జి సానుకూల స్పందన

వెల్లడించిన 'ఐఎల్ఏ' అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్

కాకినాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలి, నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరడంతో పాటు పలు సమస్యలపై న్యాయవాదులు పోరాడుతున్నారు. కోర్టు భవనాలకు మైనర్ రిపేర్లు చేయాలని, కాకినాడలో డెట్ రికవరీ ట్రిబ్యునల్(డీఆర్టీ) ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కూడా వినిపిస్తున్నారు. జిల్లా విభజన దృష్ట్యా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, కాకినాడల్లో ప్రిన్సిపల్ జిల్లా కోర్టులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జిగా నియమితులైన జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ సానుకూలంగా స్పందించారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 16 బార్ అసోసియేషన్లు, 65 కోర్టుల్లో పదివేల మంది న్యాయవాదులు, 50వేలమంది కక్షిదారులు వస్తూ ఉంటారని, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పన విషయాన్ని జడ్జి జస్టిస్ దేవానంద్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## రిటైనింగ్ వాల్ పనుల్లో అక్రమాలపై విచారణకు ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రామచంద్రపురం మండలం ఓదూరులో ఆర్‌సీసీ రిటైనింగ్‌వాల్ పనుల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సోమవారం విచారణకు ఆదేశించింది. పలు ఉల్లంఘనల కారణంగా ప్రభుత్వానికి రూ.99.98 లక్షల నష్టం వాటిల్లినట్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో పలువురు అధికారులను బాధ్యులుగా చేస్తూ విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా అప్పటి క్వాలిటీ కంట్రోల్ కాకినాడ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తురంగి శ్రీనివాసు, మరో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ సత్యనారాయణ, ఏఈఈ బొల్లంకల అప్పలరాజులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ విజిలెన్స్ విభాగం ఉత్తర్వులు ఇచ్చింది.

## కొడుకుపై తల్లి ఫిర్యాదు

కొబ్బరికాయలు దొంగిలించాడని కేసు

అమలాపురం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయలు దొంగిలించాడని కుమారుడిపై తల్లి చేసిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరూరుకు చెందిన దూడల సత్యవతికి అదే గ్రామంలో 2ఎకరాల కొబ్బరి తోట ఉంది. తోటలో కొడుకు సత్తిపండు స్నేహితులతో కలసి కొబ్బరిదింపు తీసి 6వేల కాయలు తరలించుకుపోయాడని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడని

## కొడుకుపై తండ్రి మందలింపు

ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు



అదృశ్యమైన ప్రదీప్

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన బాలుడు అదృశ్యంపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. చేబ్రోలు హరేరామ నగర్‌కు చెందిన జాగు ప్రదీప్ (17) ఈనెల 6న ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడని తండ్రి సత్యనారాయణ మందలించాడు. దాంతో ఆ రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగిరాలేదు. దీంతో తండ్రి గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రదీప్ చేబ్రోలు ఆదర్శ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాఫీ కలర్ టీ షర్టు, కార్గో న్యూ బ్లూ ఫ్యాంటు ధరించాడని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, KAKINADA DIVISION

Tenders invited from the contractors for NIT No. 8 to 24/2025-26, Dt:08.12.2025 in 3 Districts (Kakinada, East Godavari & Dr. B.R.Ambedkar Konaseema) Estimate cost various from Rs.1.85 Laksh to Rs.40.00 Lakhs.
Last date for receipt of tender Dt:19.12.2025 upto 4.00 PM
Note: For further details can be viewed at https://tender.eprocurement.gov.in or contact 0884-2378457

Executive Engineer
APEWIDC, Kakinada

# అమలాపురం



### పదో తరగతి ఫీజు చెల్లింపునకు గడువు

ముమ్మిడివరం,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపునకు పాఠశాల విద్యాశాఖ గడువు పొడిగించినట్టు డీఈవో షేక్ సలీంబాషా సోమవారం పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆలస్య రుసుంతోఈనెల15వరకు అవకాశం ఇవ్వగా తాజాగా ఈనెల18 వరకు ఆలస్య రుసుంతో ఫీజు చెల్లించవచ్చన్నారు.

### వృద్ధులకు రగ్గుల పంపిణీ

అల్లవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ పరమట నరసింహమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలపల్లిలో 150మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. పరమట సారథి, పరమట కృష్ణమోహన్, తుమ్మలపల్లి సర్పంచ్ వడ్డి సుభాషిణి, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి పాల్గొన్నారు.

## సార్వా చేజారింది..దాళ్వానూ వదులుకోవాలా?

- ముంపు సమస్యపై సభ్యుల రచ్చ
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


డ్రెయిన్ల సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ఉప్పలగుప్తం నీటిసంఘం చైర్మన్ మోటూరి

ఉప్పలగుప్తం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముంపు వల్ల సార్వా చేజారింది. చేలల్లో ముంపునీరు ఇంకా దిగలేదు. దాళ్వా కూడా వదులుకోవాలా? అంటూ నీటిసంఘాల చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు అధికారులను నిలదీశారు. బదులివ్వవలసిన డ్రెయిన్స్ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో సభ్యులు మరింత రెచ్చిపోయారు. రైతులంటే అందరికీ లోకువగా ఉందని, తమ సత్తా ఏమిటో చూపిస్తామంటూ కేకలు పెట్టారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీ రాంబాబు అధ్యక్షతన ఎంపీపీ జి.కృష్ణ నిర్వహణలో సోమవారం జరిగింది. వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు దాళ్వా సాగుపై మాట్లాడుతుండగా ఉప్పలగుప్తం నీటిసంఘం చైర్మన్ మోటూరి రవిశంకరకుమార్ డ్రెయిన్స్ ఆధునికీకరించకుండా సాగుపై సలహాలేమిటని ప్రశ్నించారు. డ్రెయిన్ల సమస్యలపై అధికారులు వివరణ ఇవ్వాలంటూ పట్టుబట్టారు. డ్రెయిన్స్ ఏఈ రాలేదని తేలడంతో సభ్యులు నిప్పులు చెరిగారు. దాళ్వా సాగుకు సమాయత్తమవుతున్న వేళ సంబంధించిన అధికారులు గైర్హాజరవ్వడం రైతులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానంఇవ్వాలంటూ ఎంపీడీవోను నిలదీశారు. వెంటనే ఎంపీడీవో డ్రెయిన్స్ ఏఈ సునీతకు ఫోన్ చేసి సొసైటీ చైర్మన్ మంచెం బాలకృష్ణను మాట్లాడమన్నారు. ఫోన్‌లో బాలకృష్ణ డ్రెయిన్లు, డ్రెయిన్లలో వలకట్లపై ఏఈని ప్రశ్నించారు. కొద్దిసేపు ఇరువురి మధ్య సంభాషణ జరిగింది. అనంతరం నీటిసంఘం చైర్మన్ రవిశంకరకుమార్ ఫోన్ తీసుకుని ఏఈతో మాట్లాడారు. తనకు ముఖ్యమైన సమావేశం ఉన్నందున సర్వసభ్య సమావేశానికి హాజరుకాలేదని ఏఈ అన్నారు. ఈదశలో సమావేశంలో సభ్యులందరూ డ్రెయిన్స్ అధికారులపై ఆగ్రహంతో కేకలు పెట్టారు. డ్రెయిన్లలో చేపల వలకట్లు తొలగించకుండా, డ్రెయిన్లు బాగుచెయ్యకుండా దాళ్వా నాట్లు వెయ్యలేమంటూ నీటిసంఘాల చైర్మన్లు వ్యాఖ్యానించారు. సమావేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో నంగవరం,సన్నవిల్లి సర్పంచ్‌లు జిన్నూరి వెంకటేశ్వరరావు, చిక్కం జంగమయ్య జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. వారంరోజుల్లో రెవెన్యూ, డ్రెయిన్స్, ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటుకు ఎంపీడీవో సభ్యులను ఒప్పించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఉపాధి హామీలో పంటకాల్వలు, బోదెల్లో పూడిక తీయించాలని సభ్యులు కోరారు. ప్రస్తుతానికి అవకాశం లేదని ఏపీవో ఎం.వీరబాబు తెలిపారు. పంచాయతీలు వాటర్ ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో ట్యాప్‌ల ద్వారా మురుగునీరు వస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ సభ్యుల ప్రశ్నలకు బదులిచ్చారు. కొత్తగా తవ్వుతున్న ఆక్వా చెరువులపై అనుమతులున్నాయా అని కిత్తనచెరువు నీటిసంఘం చైర్మన్ బండారు వెంకటేశ్వరరావు ఎఫ్‌డీవో బి.హేమానంద్‌కుమార్‌నుప్రశ్నించారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ, మండల ఇంజనీరింగు అధికారి వి.రాధాకృష్ణ, ట్రాన్స్ కో ఏఈ శ్రీహరి, సీపీడీవో వైకేడీ రమాదేవి, డీటీ జి.లలిత తమ శాఖల సమాచారాన్ని సభ్యులకు అందించారు.

## ‘పీజీఆర్‌ఎస్’కు పోటెత్తిన అర్జీలు.. ధర్నాలు


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పౌర, ప్రజాసంఘాల నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సోమవారం గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు పోటెత్తారు. వివిధ ప్రాంతాలకు చెందినవారు 265అర్జీలను అందించగా పలు అంశాలపై నిరసనలు వ్యక్తంచేసి ధర్నా చేపట్టారు. ఐ.పోలవరం మండలంలో ఒక బాలికపై అత్యాచారం చేసిన నేరస్తుడు రాయపురెడ్డి సత్యవెంకటకృష్ణ అలియాస్ బాబికి బెయిల్ రద్దుచేసి కఠినంగా శిక్షించాలని పౌర, ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. వినతిపత్రాన్ని పీజీఆర్‌ఎస్‌లో అందించారు. నిరసనలో మానవహక్కుల వేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్, జిల్లెల్ల మనోహర్, అమలదాసు బాబూరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు దీపాటి శివప్రసాద్, కారెం వెంకటేశ్వరరావు, రేవు తిరుపతిరావు, బాలిక తల్లి పాల్గొన్నారు

**సబ్సిడీపై పరికరాలు అందించాలి**

కొబ్బరికాయల ధర వెయ్యింటికి రూ.25వేలు నుంచి రెండు నెలల వ్యవధిలో రూ.13వేలకు పతనమైందని బీకేఎస్ జిల్లా సంఘ నాయకుడు ఉప్పుగంటి భాస్కరరావు పేర్కొన్నారు. పెరిగిన ఎరువుల ధరలు, కూలీలరేట్లకు అనుగుణంగా వెయ్యి కొబ్బరికాయలకు రూ.20వేలుధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా కార్యదర్శి అడబాల రాజమోహన్, సహకార్యదర్శి అప్పారి వెంకటరమణ, కోశాధికారి వంకాయల స్వామిప్రకాష్, నాయకులు సుంకర సుబ్రహ్మణ్యేశ్వరరావు, అబ్బిరెడ్డి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

**పంటకాల్వలు సైతం ఉప్పునీటి మయం : సామంతకుర్రు గ్రామ రైతులు, అల్లవరం మండలం**

తీర ప్రాంతం సామంతకుర్రులో భూగర్భ జలాలు ఉప్పునీటి మయం కావడంతో ప్రతీ అవసరానికి పంటకాల్వలపైనే ఆధార పడాల్సి వస్తుంది. అయితే వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్ ద్వారా సముద్రపు ఉప్పునీరు పోటెత్తుతుండడంతో కాల్వలు సైతం ఉప్పునీటి మయం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్‌పై సామంతకుర్రు వద్ద అడ్డుకట్లు వేయడంవల్లే ఈపరిస్థితి ఏర్పడినందున వాటిని తొలగించాలని అర్జీ అందించారు. సుంకర రామలింగేశ్వరరావు, కంకిపాటి సత్యనారాయణ,డీవీవీ సత్యనారాయణ, కె.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

## సహకార ఉద్యోగుల నిరసన


ముమ్మిడివరంలో సహకార ఉద్యోగుల ధర్నా


కాట్రేనికోనలో ధర్నా

ఉప్పలగుప్తం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఉప్పలగుప్తం సహకార సంఘం వద్దసోమవారం మండలంలోనిసహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. పీఏసీఎస్‌ల యూనియన్ మండల డైరెక్టర్ ఆకుల సూర్యప్రభాకరరావు, సీఈవోలు చిక్కం లింగయ్యనాయుడు, మంచెం బాబి,కూనంపూడి శ్రీనివాసరాజు, ఆకుల వీరగణేశ్, నాగులపల్లి సతీష్, పోలిశెట్టి దుర్గాప్రసాద్, సిబ్బంది సలాది గణేశ్వరరావు, యెరుబండి రమణ, గంగుమళ్ళ దొరబాబు, పి.వెంకట్రాజు, చిక్కం ఫణీంద్ర, సలాది నాయుడు, ఆకుల రామానాయుడు పాల్గొన్నారు.

**అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి):** సహకార సంఘ ఉద్యోగులు అయినవిల్లి డీసీసీబీ బ్రాంచి వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పావులూరి వెంకటేశ్వరరావు, మేడిద వెంకటేశ్వరరావు, ఇంటి మణికంఠ, వెలంకాయల శ్రీనివాస్, దొమ్మేటి గణేష్, సవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**రాజోలు, (ఆంధ్రజ్యోతి):** సొసైటీల లాభ నష్టాలతో సంబంధం లేకుండా సహకార సంఘాల ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని రాజోలు డీసీసీబీ బ్రాంచి వద్ద సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. 2019-24 వేతన సవరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి):** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీసీసీబీ బ్రాంచి పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులంతా సోమవారం ముమ్మిడివరంలోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మట్టపర్తి జయరామ్, మాదాల కుమార్, శిరంగు నారాయణ, నంద్యాల మణికంఠ, బయ్యవరపు శ్రీను, వాసంశెట్టి శివలపాల్గొన్నారు.

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సొసైటీ ఉద్యోగులు అంబాజీపేట డీసీసీబీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వినతిపత్రాన్ని డీసీసీబీ మేనేజర్ బి.నాగేశ్వరరావుకు అందించారు. సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

**మలికిపురం, (ఆంధ్రజ్యోతి):** మలికిపురం బ్యాంకు పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం డీసీసీబీ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మేడిచర్ల రామలింగేశ్వరరావు, ముప్పర్తి చంటి, తాడి నీలకంఠం, ఆకుల భోగేశ్వరరావు, రామరాజు, ప్రభాకరరావు, దివ్వినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి):** కాట్రేనికోన డీసీసీబీ బ్రాంచ్ వద్ద డిమాండ్ల సాధనకు సహకార ఉద్యోగులు ధర్నా చేశారు. కార్యక్రమంలో కందికుప్ప సీఈవో యర్రంశెట్టి రామచంద్రరావు, అప్పారి సత్యపరమేశ్వరరావు, పి.వరహాలరాజు, విత్తనాల శంకర్, గుత్తుల వెంకటశ్రీనివాస్, గుబ్బల నాగేంద్రకుమార్, అక్కల కిరణ్, యర్రంశెట్టి నాని, గొల్లపల్లి శ్రీనివాసరావు, జొన్నాడ వెంకటేష్, కురసాల సురేష్ పాల్గొన్నారు.

**పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి):** డిమాండ్లు పరిష్కరించాలని సహకార ఉద్యోగులు డిమాండ్ చేశారు. పి.గన్నవరం డీసీసీబీ బ్రాంచ్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించినిరసన చేపట్టారు. వ్యవసాయ సహకార ఉద్యోగుల యూనియన్ మండల అధ్యక్షుడు పోలిశెట్టి శేషగిరిరావు, సీఈవోలు పప్పుల వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి సోమేశ్వరరావు, పినిశెట్టి శివనాగప్రసాద్, చిట్టినీడి సూర్యనారాయణమూర్తి, రుద్ర మణికంఠ పాల్గొన్నారు.

**మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి):** దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం సహకార సంఘ ఉద్యోగులు డీసీసీబీ బ్రాంచి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అడబాల పెద్దిరాజు, నయినాల శ్రీరామ్, విఘ్నేష్, సీహెచ్ రమేష్, స్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలి


అఖిల భారత మహాసభల బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఐదు రోజులు నిర్వహించనున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నకిలే సూర్యనారాయణలు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో అఖిలభారత మహాసభ బ్రోచర్లను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ అఖిలభారత మహాసభలు డిసెంబరు 31నుంచి జనవరి 4వరకు విశాఖపట్నంలో జరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై ఈమహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, విత్తనాల రాంబాబు, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, పలివెల ప్రసాద్, గుత్తుల హైమావతి, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

### దివ్యాంగుల దినోత్సవం

ఐ.పోలవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగ బాలలతో కేక్ కట్ చేయించారు.సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు, ప్రత్యేక అధికారి కృష్ణ, ఎంఈవోలు నల్లమిల్లి కొండారెడ్డి, వీధి సురేష్‌బాబు, హెచ్‌ఎం నక్కా ప్రసాద్‌కుమార్, సుభద్రాలక్ష్మీదేవి , రవివర్మ, పావని, సీఆర్పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సమన్వయంతో పనిచేయాలి

ఐ.పోలవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ మోర్త మిరియంజ్యోతి సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. పంటకాల్వలు అధ్వానంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని తిల్లకుప్ప సర్పంచ్ కడియం తమ్మయ్య ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో దీక్షితులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

### కొబ్బరి కనీస మద్దతు ధర రూ.20వేలు ప్రకటించాలి

అంబాజీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొబ్బరి ధరలు పతనమవుతున్న నేపథ్యంలో వెయ్యి కాయలకు కనీస మద్దతు ధర రూ.20వేలు ప్రభుత్వం ప్రకటించాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహశీల్దారు బి.చినబాబుకు రైతులు వినతిపత్రాన్ని అందించారు. కొబ్బరికాయల దింపు తీసేందుకు, ఎరువులకు, కూలీల ఖర్చులు కూడా రావడంలేదన్నారు. కొబ్బరి పంటపై ఆధారపడి జీవించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

## సామాజిక న్యాయం కోసం పుట్టింది జనసేన


జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పి.గన్నవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం జనసేన పార్టీ పుట్టిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం అంబాజీపేట మండలం మాచవరం వైసీపీ ఎంపీటీసీ మట్టా పార్వతితో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వెలుగు సీసీగా పనిచేసిన జె.శాంతి తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. పెదపట్నంలంకకు చెందిన ఇద్దరు వలంటీర్లతో సహా అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. రెండు మండలాలు వారిని ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెనుమాల లక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వర్లు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయి కృష్ణ, పాలూరి పణి, ఆదిమూలం సూరయ్యకాపు, తాటికాయల శ్రీనివాసరావు, యల్లమిల్లి చిట్టిబాబు, అన్నాబత్తుల హనుమాన్ పాల్గొన్నారు.

### గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఠాణేలంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం జరిగిన బాలిక అదృశ్యం కేసులో నిందితుడికి సహకరించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం ఎస్ఐకు కూడా ఫిర్యాదు చేశారు. పాఠశాల యాజమాన్యం విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే ఈఘటన చోటు చేసుకుందన్నారు. సెక్యూరిటీగార్డు, హౌస్‌మేడమ్, ప్రిన్సిపాల్ ఈఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేటతెల్లమవుతుందని, చట్టరీత్యా చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలన్నారు.

### పంచాయతీ వార్డు సభ్యుడి మృతి

మామిడికుదురు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మామిడికుదరు గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యుడు సర్కిల్ ముస్తఫా హైదర్(49) అనారోగ్యంతో సోమవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి మృతిపట్ల మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సంతాపం తెలిపారు.

### బ్యాటరీ సైకిల్ అందజేత

అంతర్వేది, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి):కేశవదాసుపాలేనికి చెందిన మండా కొండలరావుకు త్రీవీలర్ బ్యాటరీ సైకిల్‌ను టీడీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య సోమవారం అందజేశారు. ఇటీవల కనక ముత్యాలమ్మవారి జాతరకు వచ్చిన అమూల్యను కలసి దివ్యాంగుడైన కొండలరావు విన్నవించుకోగా అమూల్య బ్యాటరీ సైకిల్‌ను అందించారు.

### విద్యార్థినులు శిక్షణ పొందాలి

అంబాజీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం విద్యార్థినులు సెల్ఫ్‌డిఫెన్స్‌లో శిక్షణ పొందాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, తొండవరం జిల్లా పరిషత్ పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నాయకులు జీవీ రమణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సీతారాం, అప్పారి శశికుమార్, రాజు, శ్యామ్‌ప్రసాద్, రాజశేఖర్, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### పాశర్లపూడిలో శ్రీకృష్ణ-జాంజవతి కల్యాణం

మామిడికుదురు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి గ్రామంలోని శ్రీపాశర్లపూడి సత్రంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ-జాంజవతి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజోలు ఖండ ధర్మ ప్రచారక్ భైరిశెట్టి కోటేశ్వరరావు ప్రధాన కర్తగా పాల్గొని ఆదిజాంబవనుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో డి.ప్రభాకరశర్మ, కె.ధర్మారావు, చుట్టుగుళ్ల కిశోర్, మందా గాంధీ, పాశర్లపూడి దుర్గారావు, ఉంద్రాజవరపు శివ పాల్గొన్నారు.

### ‘బ్రహ్మకుమారీల’ 37వ వార్షికోత్సవం



అమలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అమలాపురంలో ఓంశాంతి కేంద్రం ఏర్పాటై 37ఏళ్ల పూర్తి చేసుకున్న తరుణంలో వార్షికోత్సవం సోమవారం రవణం వీధిలోని ఓంశాంతి హార్మోని హౌస్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ధ్యాన మార్గంలో 27ఏళ్ల పూర్తి చేసుకున్న సుమారు 82మందిని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం తరపున ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ నుంచి బీకే సరోజాదీదీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రజనీలు పాల్గొన్నారు. కోనసీమ బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే శ్రీదేవి ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక జీవనం సాగిస్తూ రాజయోగ ధ్యాన మార్గంలో అనేకమందికి ప్రేరణ కలిగిస్తున్న 82మంది బ్రహ్మకుమరీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీకే మీరా, బీకే లక్ష్మి, స్వరూప, చంద్రకళ, భవానీ, వేలాది మంది బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

### పేరూరులో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరం

అమలాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పేరూరులో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని సోమవారం సర్పంచ్ దాసరి అరుణ ప్రారంభించారు. ఏడు రోజుల పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రోగ్రాం ఆఫీసర్ దుర్గారావు తెలిపారు. తొలిరోజు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు.

### ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

అంబాజీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడుగా కుంపట్ల వెంకటసుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఎండీఎస్ఎం షరీఫ్, ఆర్థిక కార్యదర్శిగా బళ్ల శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ బోనం గంగాధర్, బాలనాగు గుప్త, బళ్ళ శ్రీనివాస్, మట్టా ధనలక్ష్మి తదితరులు అభినందించారు.

### హనుమానాయక్‌కు ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ అవార్డు



అంబాజీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పెద్దవీధిలోని శ్రీలక్ష్మి అడ్వాన్స్ నేచర్ ఫిజియోథెరపీ రిహేబిలిటేషన్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ హనుమానాయక్ అమలాపురం కిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ అవార్డును అందుకున్నారు.

### స్టడీమెటీరియల్ పంపిణీ

రాజోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) తాటిపాక జడ్పీ ఉన్నత పాఠశాల 1997-98 పూర్వవిద్యార్థుల ఆర్థిక సహాయంతో పదో తరగతి విద్యను అభ్యసిస్తున్న 70మంది విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు.

### ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కల్యాణ్‌బాబు



మామిడికుదురు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన కారుపల్లి కల్యాణ్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమలాపురంలో జరిగిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఆయన్ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు చిక్కం రవికుమార్, ప్రధాన కార్యదర్శి నేల వెంకటేశ్వరరావు తెలియచేశారు. కల్యాణ్‌బాబును మట్టా నాగరాజు, కె.రాఘవరావు, తోట ప్రసాద్, గంటా వెంకన్న, ఎస్టీయూ నాయకులు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

### బాలికలు జాగ్రత్తగా ఉండాలి

ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికలు ప్రస్తుత సమాజంలో ఎంతో జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజనీ పేర్కొన్నారు. సోమవారం అనాతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆమె అవగాహన సదస్సులు నిర్వహించారు. హెచ్‌ఎం గణేశ్వరరావు, ప్రసాద్, కె.రాధ, సంఘ సభ్యులు జంగా తనూజ పాల్గొన్నారు.

### పురాతన అమ్మవారి దేవాలయానికి నిధులు కేటాయించాలి



పి.గన్నవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లంకల గన్నవరంలో గ్రామ దేవత శ్రీమహాలక్ష్మి అమ్మవారి పురాతన దేవాలయానికి నిధులు కేటా యించాలని గ్రామస్తులు కోరారు. పి.గన్నవరంలో సోమవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వారు వినతిపత్రం అందించారు. అమ్మవారి ఆలయం పల్లంలో ఉండటంతో ప్రతి ఏడాది అధిక వర్షాలకు గర్భగుడితో సహా ఆలయం మునిగిపోతుందని ఎమ్మెల్యేకు తెలిపారు. తొలుత అమ్మవారి ఆలయం వద్ద గ్రామస్తుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ఏవిధంగా నిధులు సమకూర్చుకోవాలి, పూజా కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, చిట్టాల జోగేశ్వరరావు, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, గనిశెట్టి శ్రీనివాసరావు, డొక్కా చినగోపాలం, కొపనాతి సీతారామస్వామి, గనిశెట్టి కేదారేశ్వరరావు, పిల్లి సత్యనారాయణ, యర్రంశెట్టి రామకృష్ణ, వేమన సత్తిబాబు, మట్టపర్తి సాయిబాబు, పర్రంశెట్టి శ్రీరాములు, లంకే చిరంజీవి, భీమరాజు, కందికట్ల నాగేశ్వరరావు, అన్నాబత్తుల హనుమాన్, యర్రంశెట్టి చిన్నా, యాన్నాబత్తుల నాగరాజు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

యానాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యానాం కురసాంపేటను ఆనుకుని ఉన్న కల్వర్ట్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి వర్క్ ఆర్డర్ వచ్చి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించక పోవడంతో సోమవారం అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కల్వర్ట్‌ను పరిశీలించారు. పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశాలు జారీచేశారు. అలాగే ఇప్పటికే భూమిపూజ చేసిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాపనులశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 11న మాదిగల ఆత్మీయ కలయిక


ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు ప్రముఖ నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈనెల11న మాదిగల ఆత్మీయ సమావేశం భారీస్థాయిలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌మాదిగ పేర్కొన్నారు. సోమవారం అమలాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల ఆత్మీయ సమావేశానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కోనసీమ జిల్లాలో ఉన్న మాదిగలంతా ఆత్మీయ కలయికకు హాజరు కావాలని సీనియర్ న్యాయవాదులు యార్లగడ్డ రవీంద్ర, మడికి శ్రీరాములు, బడుగు శ్రీను, పలివెల మోహనరావు పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న మాదిగలంతా తమ ఐక్యతను చాటుకుంటూ రాజకీయంగా, సామాజికంగా ఎదుగుదలకు చేసే కృషిలో భాగంగానే ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నాయకులు నేదునూరి నతానియేలు, పలివెల నాగేంద్రప్రసాద్, ఆకుమర్తి దుర్గారావు, డాన్‌నూరి, చుట్టుగుళ్ల కిశోర్, ఆకుమర్తి ఆశీర్వాదం, సవరపు భైరవమూర్తి, ఆకుమర్తిమోహన్, మంద రామకృష్ణ, ముస్కూడి నరసింహమూర్తి పిలుపునిచ్చారు.

### డీబీఆర్సీ సాయం

అల్లవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 12గ్రామాల్లో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన 2500 దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.4,500 చొప్పున దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్టార్ట్ నెట్‌వర్క్, సీఏఐడీ సంయుక్త సహకారంతో సాయం అందజేస్తున్నట్టు డీబీఆర్సీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లాడ దేవకుమార్ అన్నారు. సోమవారం కొమరగిరిపట్నం కొడప ప్రాంతంలో దళిత కుటుంబాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డిప్యూటీ డైరెక్టర్లు నాగలక్ష్మి, శామ్యేలు, అనిల్‌కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత, ప్రతినిధులు అల్లాడ జెస్సీ, రవికిరణ్, శ్రీనివాస్, కాకర సుధీర్, యాళ్ల సోమరాజు పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్‌గా రాఘవన్

యానాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యానాంమున్సిపల్ కమిషనర్‌గా పుదుచ్చేరికి చెందిన ఐ.రాఘవన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 20మంది సూపరింటెండెంట్లు, తహశీల్దార్లకు పదోన్నతి కల్పించారు. పుదుచ్చేరి పరిశ్రమల శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాఘవన్‌ను మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మలికిపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురం క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.39లక్షల చెక్కును 64మంది బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందించారు. 18నెలల కాలంలో సీఎం సహాయనిధి నుంచి రూ.5.11కోట్లు 611 బాధితులకు వైద్య సాయం నిమిత్తం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

మామిడికుదురు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం బి.దొడ్డవరం గ్రామంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో బి.దొడ్డవరం గ్రామంలో పాటురేవు ద్వారా ఉప్పునీరు వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి పార్టీ ద్వారా కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో నక్కా త్రిలోచనరావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, యేడిద బాబులు, సుంకర నాగభూషణంపాల్గొన్నారు.

### డ్రగ్స్‌పై అవగాహన

మలికిపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గూడపల్లి పల్లిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఐ వీవీవీఎస్ఎన్ సురేష్ గంజాయి, డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలు గురించి వివరించారు. సెల్‌ఫోన్‌ను సక్రమంగా వినియోగించకపోతే సంభవించే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆచంట రామచంద్రరావు, గ్రామ సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు లక్ష్మీనారాయణ ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-11 క్రికెట్ పోటీల్లో అంబాజీపేట పదో తరగతి విద్యార్థి సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, ఆకుల ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈనెల14న కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### బుర్ర కథ కళాకారుడి మృతి

మలికిపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గూడపల్లి గుబ్బలపలెం వసంత కాలనీకి చెందిన బుర్రకథ కళాకారుడు యడ్ల వెంకటేశ్వరరావు సోమవారం మృతిచెందారు. ఈయనకు అక్షరజ్ఞానం లేకపోయినా 50ఏళ్లుగా అనేక ప్రాంతాల్లో బుర్రకథ కాలక్షేపాలు నిర్వహించారు. ఈయన మృతి పట్ల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

### రక్తపింజర హల్‌చల్

ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ డాక్టర్ రావుబహదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు కళాశాల ఆవరణలో సోమవారం రక్తపింజర పాము హల్‌చల్ చేసింది. దీంతో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు భయాందోళన చెందారు. స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ అక్కడకు చేరుకుని పామును బంధించారు. అటవీ ప్రాంతంలో వదిలినట్టు వర్మ తెలిపారు. దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.


**ప్రకటన**



కీ॥శే॥ కాశి వెంకట్రావు, కీ॥శే॥ కాశి లక్ష్మికాంతం

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం, చింతలమెరక గ్రామకాపురస్తులు కాశి వెంకట్రావు (లేటు) వారు కుమారుడు కాశి వెంకటేశ్వరరావు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.
మా తండ్రి గారైన కాశి వెంకట్రావు గారు ది.05.12.1983 సం॥లో, మా తల్లి గారైన కాశి లక్ష్మికాంతం గారు ది.08-06-1988 సం॥లో ముమ్మిడివరం మండలం, చింతలమెరక గ్రామంలో వారి ఇంటి వద్ద మరణించారు. వీరి మరణం పంచాయితీ రికార్డులో నమోదు చేయలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల 10 రోజులలో తెలియచేయగలరు.

ఇట్లు: కాశి వెంకటేశ్వరరావు
చింతలమెరక, ముమ్మిడివరం, సెల్:8106359274

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం





క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

### మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యం. మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్ సమకూరుతుందని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కాకినాడ రోటరీ క్లబ్ చైర్మన్ టి.వీరవెంకట సత్యనారాయణ, మహేష్ బాబు ఫౌండేషన్ సమకూర్చిన క్రీడా పరికరాలను మంత్రి పంపిణీ చేశారు. విద్యార్థులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కూటమి ప్రభుత్వం చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.బుజ్జి, ఎంఈవో వీర్రెడ్డి, హెచ్ఎంలు ఎం.సత్యనారాయణ, అంకూరి సురానా, డాక్టర్ రేణుక, ఊడుమూడి సర్పంచ్ కోటిపల్లి సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టరు నారపరెడ్డి బలరామ్, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, అన్నాయిపేట టీడీపీ అధ్యక్షుడు మంగా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల గురించి మాట్లాడే హక్కు జోగి రమేష్‌కు లేదు

### టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం



కొత్తపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో అడ్డంగా దొరికిన మాజీ మంత్రి జోగి రమేష్‌కు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం కుంభకోణంలో జోగి రమేష్ దొరికిపోయి రిమాండ్‌కు వెళ్లిన సంగతి అందరికి తెలుసన్నారు. ఇప్పుడు ఆ విషయాన్ని కొంత మంది వైసీపీ నాయకులు బీసీ కులాన్ని అడ్డుపెట్టుకుని మాట్లాడుతున్నారని బీసీ కులంలో పుట్టినంత మాత్రాన తప్పు చేసిన వారిని చట్టం ఉపేక్షించదని జోగి రమేష్ శిక్షార్హుడేనన్నారు. ఆయన జగన్‌మోహన్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా ఉం డగా బీసీల గురించి ఆలోచించడం, స్పందించడంగాని చేయలేదన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు కొమ్ముకాస్తుందని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు తెలుసుకోవాలని లేనిపక్షంలో డిబేట్‌కు సిద్ధంగా ఉన్నట్టు సుబ్రహ్మణ్యం ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



సోలార్ పథకంపై మెప్మా సిబ్బందితో సమీక్ష జరుపుతున్న కమిషనర్ రంగారావు

## సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లుల ఆదా

### మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ప్రధాన మంత్రి సూర్యఘర్ సోలార్ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సూర్యఘర్ పథకంపై మెప్మా సిబ్బందితో పాటు ఆర్‌పీలతో సమావేశం నిర్వహించి పథకం విధానాలను వివరించారు. ఈ పథకం కోసం అందించే సబ్సిడీని వివరించడంతోపాటు కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. కాలుష్య నివారణతోపాటు భవిష్యత్ అవసరాల కోసం సోలార్ వినియోగం అవసరమన్నారు. సమా వేశంలో మెప్మా సిబ్బందితో పాటు మున్సిపల్ ఏఈలు పవన్‌కుమార్, బ్యాంకర్లు, మెప్మా ఏపీఎం సుజాత, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ రైతుపై కూలీ దాడి

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నర్సరీ రైతు వద్ద పనిచేసే కూలీ, మరో నర్సరీ రైతుపై దాడికి పాల్పడి పరారైన ఘటన మండపేట మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి మండపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏడిదలో కుందేటి వెంకన్నబాబు, మల్లిపూడి శ్రీనివాసరావు నర్సరీలు నిర్వహిస్తున్నారు. వారిద్దరూ పక్కపక్కనే నర్సరీలను నడుపుతున్నారు. ఇటీవల వెంకన్నబాబుకు చెందిన లారీల వల్ల శ్రీనివాసరావుకు చెందిన నర్సరీ మొక్కలు దెబ్బతిన్నాయి. ఈ విషయంపై శ్రీనువాసరావు అతన్ని ప్రశ్నించగా బదులివ్వలేదు. మరుసటి రోజు వెంకన్నబాబు పొలంలో పనిచేసే వ్యవసాయకూలీ మన్యం శ్రీను, నర్సరీ రైతు శ్రీనువాసరావుపై దారికాచి ఆదివారం కత్తితో దాడికి పాల్పడటంతో గాయపడ్డాడు. గాయపడిన శ్రీనువాసరావును వెంటనే కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ సోమవారం విలేకరులకు తెలిపారు.



వెంకన్న ఆలయంలో జరిగిన అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తజనం

## కిటకిటలాడిన వాడపల్లి ఆలయం

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం, నివేదన కార్యక్రమాలను నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి ఆచంటకు చెందిన కంతంశెట్టి సత్యకృష్ణ కుటుంబ సభ్యు లు రూ.30,116 విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేశారు.

## విత్తనశుద్ధితో పంటలకు ఎంతో మేలు

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాన్ని బీజామృతంతో శుద్ధి చేయడం పంటలకు ఎంతో మేలని ఏడీఏ ఎంవీ రామారావు తెలిపారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ గ్రామమైన వాడపాలెంలో రైతులు, డ్వాక్రా మహిళలతో సామూహికంగా బీజామృత విత్తనశుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ రామారావు మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం ద్వారా భూమి నుంచి వచ్చే తెగుళ్లను నివారించడంతోపాటు విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను నివారించవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న 17 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.15.97 లక్షల చెక్కులు మంత్రి సుభాష్ సోమవారం అందజేశారు. స్థానిక మంత్రి క్యాంపుకార్యాలయంలో ఆయన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, టీడీపీ మండలాల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీను, మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, స్వచ్ఛాంధ్ర డైరెక్టరు సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు గణపతి ఆలయంలో ప్రత్యేక అలంకరణలోనున్న స్వామివారు

### భక్తిశ్రద్ధలతో

## సంకటహర చతుర్థి

ఆలమూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థి సందర్భంగా మండలంలోని గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గణపతి హోమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలమూరు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు నాగాభట్ల సాయి అధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం జరపగా, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెదపళ్ల, చింతలూరు, సంధిపూడి, పినపళ్ల, నర్సిపూడి, జొన్నాడ, మడికి తదితర గ్రామాల్లోని గణపతి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు

## ఎమ్మెల్యే వేగుళ్ల కృతజ్ఞతలు

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు తూర్పు గోదావరి జిల్లాలో మండపేటను కలపడంపై స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయడంతో తనతోపాటు ప్రజలంతా రుణపడి ఉంటామని ఎమ్మెల్యే అన్నారు.

## ఘనంగా సంకటహర చతుర్థి పూజలు

రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయవరం రాజరాజేశ్వర కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయకుడి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాలధరి త్రినాధ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వినాయకుడికి ఏకవార అభిషేకాలు, గరికపూజ, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల నేవైద్యాలు సమర్పించి హారతులు ఇచ్చిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కాలధరి సీతారామశర్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

### పుట్టినరోజు వేళ..

## మొక్క నాటిన విద్యార్థిని

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న అనయాల లక్ష్మీకుమారి పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. పాఠశాల హెచ్ఎం బత్తిన రాజేశ్వరి మాట్లాడుతూ కాలుష్యం వల్ల కలుగుతున్న నష్టాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడాన్ని విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె.మురళీకృష్ణ, విద్యా కమిటీ కోఆప్షన్ సభ్యులు నాయుడు, హిందీ ఉపాధ్యాయిని కర్రి సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### అరటి మార్కెట్ యార్డు

## అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రావులపాలెం అరటి మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధిపరిచేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. సోమవారం ఆయన తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి మార్కెట్ యార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ అరటి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. వెదిరేశ్వరం కాలువ వైపు డ్రైనేజీ నిర్మాణం, నూతన షాపింగ్ కాంప్లెక్స్ వే బ్రిడ్జి నిర్మాణాలు చేపడతామన్నారు. ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించి త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాడపాలెంలో మండల పాస్టర్స్ ఐక్య గ్లోరియస్ క్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి విశ్వాసులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ల ఐక్య అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ అడపా ప్రసాద్, పిల్లి ప్రభాకరరావు, ఎం.వడ్డీయస్ వర్గిస్, ఎన్.డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌లో మూడు అర్జీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో మూడు అర్జీలు వచ్చినట్టు ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు. అంగరలోని చెరువుల ఆక్రమణలు తొలగించాలని, ద్రాక్షారామలో భూ ఆక్రమణ, రామచంద్రపురంలో మ్యుటేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు.





ఆలమూరు డీసీసీబీ బ్రాంచ్ వద్ద వినతిపత్రం అందజేస్తున్న సహకార ఉద్యోగులు. పక్క చిత్రంలో ద్రాక్షారామ డీసీసీబీ బ్రాంచి వద్ద నినాదాలు చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

## సమస్యలు పరిష్కరించాలని సహకార ఉద్యోగుల ఆందోళన

ఆలమూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని సహకార ఉద్యోగులు సోమవారం డీసీసీబీ ఆలమూరు బ్రాంచ్ వద్ద ఆందోళన చేశారు. సహకార ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బా సుబ్రహ్మణ్యం అధ్వర్యంలో ఉద్యోగులు డీసీసీబీ బ్రాంచ్ వద్ద నినాదాలు చేశారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, చింతలూరు, మోదుకూరు, నర్సిపూడి, పెనికేరు, జొన్నాడ, చొప్పెల్ల సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### జీవో 36 అమలు చేయాలి

**ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి):** ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు సోమవారం ద్రాక్షారామ డీసీసీబీ బ్రాంచి వద్ద సహకార ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సహకార సంఘాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 36 జీవో జారీ చేశారన్నారు. అప్పటి నుంచి అధికారుల వైఖరితో జీవో పూర్తిగా అమలు చేయలేదని, వెంటనే దాని అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో బ్రాంచ్ పరిధిలోని సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రాంచ్ ప్రతినిధి గొడవర్తి సూర్యనారాయణ చౌదరి, ఇళ్ల వీరబ్రహ్మం, అద్దంకి ధనరాజు, కాకినాడ వీరబాబు, కాకినాడ మహాలక్ష్మీ, సమనస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సహకార ఉద్యోగుల ఆందోళనకు సీఐటీయు నాయకులు నూకల బలరాం, అంగన్‌వాడీ ఉద్యోగుల జిల్లా నాయకులు మేడిశెట్టి దుర్గమ్మ తదితరులు మద్దతు తెలిపారు.



ఆత్రేయపురంలో ఎంఈవో కార్యాలయ భవనం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

## ఎంఈవో కార్యాలయానికి స్థలం పరిశీలన

ఆత్రేయపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల విద్యాశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం సమకూర్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి.శ్రీకర్ తహశీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న స్థలాన్ని పరిశీలించి భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఎంఈవో కార్యాలయానికి రూ.55 లక్షలు మంజూరు కాగా స్థలం సమస్య ఏర్పడింది. ఎమ్మెల్యే కృషితో ఆర్డీవో స్థలాన్ని ఇప్పించి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. స్థలం పరిశీలనలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్లపూడి భాస్కరరావు, ముదునూరి రామభద్రరాజు, తహశీల్దార్ రాజేశ్వరావు, ఎంఈవో వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

## 'తూర్పు'లో విలీనంపై హర్షం

కపిలేశ్వరపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం గ్రామంలోని బ్యాంకు కెనాల్ లాకుల వద్ద సోమవారం మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూళ్ల సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు ఎ.గోపాలకృష్ణ, తాతపూడి, మాచర నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కె.భవ్య, కొరపాటి జానకి రామయ్య, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, డ్రైన్స్ డీఈఈ పోచారావు, ఏఈ కృష్ణ, త్రిమూర్తులు, ఎస్.శ్రీను, టీడీపీ మండల అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, పడమరఖండ్రిక పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, త్రిపురశెట్టి నాని, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




మాచవరంలో వాహనదారులతో హెల్మెట్లను కొనుగోలు చేయిస్తున్న సీఐ దొరరాజు

## వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, అనుకోని ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరిస్తే ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చునని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అన్నారు. సోమవారం మాచవరం సెంటర్‌లో డీఎస్పీ బి.రఘువీర్ ఆదేశాలపై సీఐ పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ చేసిన సీఐ వారి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర డాక్యుమెంట్‌లను పరిశీలించారు. డాక్యుమెంట్స్ చూపని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించి వారితో హెల్మెట్‌ని కొనుగోలు చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ సోము వీర్రాజు పరామర్శ

ద్రాక్షారామ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మాతృ వియోగంతో బాధపడుతున్న ద్రాక్షారామ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు, హసన్‌బాద గ్రామ సర్పంచ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావును సోమవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు పరామర్శించారు. బీజేపీ రామచంద్రపురం మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడు దునే శ్రీను, యువ మోర్చా నాయకులు కల్యాణ్, తోలేటి సూర్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకట్రావు, పుల్లెల రామమూర్తి, కుమార్ యాదవ్, ఇంధన సత్యనారాయణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



దివంగత నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వీర్రాజు తదితరులు

## 11న ఎంపీపీ ఎన్నిక

కపిలేశ్వరపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి ఈనెల 11న ఉదయం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో నిర్వహించనున్నట్టు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిణి, డివిజనల్ అధికారిణి వి.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను పురస్కరించుకుని ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి 2025 అక్టోబరు 13న తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవికి ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

## ఆర్డీవోకు ఫిర్యాదు

రాయవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాయవరం మండల ప్రజా పరిషత్ సముదాయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద అపరిశుభ్ర పరిస్థితిపై మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్ సోమవారం రామచంద్రపురం డి.అఖిలకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డి.దాసు, జి.సూరిబాబు, జి.అర్జున్, ఎ.శ్యాంసన్, జి.శేషుబాబు, జై బీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగ బాలుడిని సన్మానిస్తున్న ఎంఈవో తాతారావు తదితరులు

### దివ్యాంగులకు చేయూత

## అందించాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేయూతనందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎంఈవోలు కె.తాతారావు, విజయకుమార్ అన్నారు. సోమవారం కపిలేశ్వరపురం దేవీ సెంటర్ వద్దనున్న భవిత సెంటర్‌లో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. భవిత సెంటర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న టీచర్లను ప్రశంసించారు. భవిత సెంటర్‌కు వచ్చిన పిల్లలు ఎలా అభివృద్ధి చెందాలో తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కేంద్రంలో పనిచేస్తూ సేవలందిస్తున్న సీజీవీకి, ఆటో డ్రైవర్‌కు సన్మానం చేయగా ఆటిజంతో బాధపడుతున్న వాళ్ల బాబుకు నేర్పుతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్న రేవతిని సన్మానించారు. తల్లులంతా సునీతను సన్మానించగా, అనంతరం కేక్‌కట్ చేసి ముగించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు కె.వెంకట్రావు, రిటైర్డ్ టీచర్ రాఘవులు, స్థానిక దేవీ సెంటర్ పాఠశాల హెచ్ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద

## నేడు అన్న సమారాధన

కె.గంగవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కె.గంగవరం మెయిన్ రోడ్డులోనున్న భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారి అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

**పేపర్ ప్రకటన**

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.22 of 2022 in O.S.No.282 of 2010
Between:
చింతా బాపిరెడ్డి ... D.Hr
And
కొమరగిరి శారదా పద్మావతి ... J.Dr
JDr:- కొమరగిరి శారదా పద్మావతి
To,
కొమరగిరి శారదా పద్మావతి W/o లేట్ వెంకట మల్లిఖార్జున గౌడ్, వయస్సు 52 సం.లు, హిందువు, గృహిణి, రథం వీధి, రామాలయం వెనుక, ఏడిద, మండపేట మండలం, రామచంద్రపురం J.Cj., కోనసీమ జిల్లా.
పై నంబరు పిటిషన్ ది.10-12-2025వ తేదీన వాయిదా అయివున్నది. ఆ రోజున మీరు స్వయంగా కానీ మీ న్యాయవాదితో కానీ ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు హాజరు అయి మీ వాదనలు తెలుపుకొనవలెను. లేని యెడల శ్రీకోర్ట్ వారు మీకు పరోక్షంగా తీర్పు చెబుదరు.
శ్రీకోర్ట్ వారి అర్డర్ ప్రకారం
పెద్దాపురం శ్రీ M.K. మొహియుద్దీన్,
తేది.29.11.2025 అడ్వకేట్, పెద్దాపురం